# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 1-7-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:252 పేజీలు:6 వెల: రూ.1/-


**నేటి కందం-నేటికి అందం**

సీషెల్సు తోడ మోడీ
ఆషామాషీగ కాక ఆత్మీయముగా
భాషించుచు తొలగించెను
శేషించిన విషయ చయపు చిక్కుల నెల్లన్

(డిజిటల్ చెల్లింపులు, లైన్ ఆఫ్ క్రెడిట్ వంటి పందొమ్మిది ఒప్పందాలను చేసుకున్న మోడీ ని సీషెల్స్ ప్రభుత్వం అత్యున్నతమైన పురస్కారంతో గౌరవించడం ద్వారా భారత దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటింది.)

-రాధశ్రీ

సెల్:9494481210



**చురక**

అరకొర రైతు భరోసా
అసంతృప్తిలో జనం
సరిదిద్దుకోక పోతే
సర్కారుకు దుర్దినం
గత ప్రభుత్వ పథకాలకు
గండిపడితే దుష్ఫలితం
అప్పోసప్పో చేసైనా
అమలుచేస్తే సత్ఫలితం

-వేల్పుల నారాయణ
9440433475



# తెలంగాణను ఇబ్బంది పెట్టాలన్నదే కేంద్రం ఆలోచన: పొన్నం ప్రభాకర్



మెదక్, జూన్ 30:జిల్లాలోని హుస్నాబాద్ పట్టణంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలోని 17, 18 వార్డుల్లో కొనసాగుతున్న సర్ (ఎస్ఐఆర్) ఓటర్ సవరణ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఎరువుల తయారీ, సరఫరా కేంద్రం పరిధిలోని అంశమన్నారు. ఏ రాష్ట్రంలో కూడా ఎరువులు తయారు చేసుకోరని తెలిపారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం లేదు కాబట్టి ఉద్దేశపూర్వకంగా సరఫరాలను తగ్గించి ఇబ్బందులు సృష్టిస్తోందని ఆరోపించారు. ఎరువుల సరఫరా భారతీయ జనతా పార్టీ(బీజేపీ) బాధ్యత అని చెప్పుకొచ్చారు.

కేంద్ర ప్రభుత్వం తయారు చేసే ఎరువులతో పాటుగా తెలంగాణలో ఉన్న ఎరువుల ఫర్టిలైజర్ ఫ్యాక్టరీని తెలంగాణ రాష్ట్రానికి అప్పగించాలని మంత్రి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎరువుల కొరత ఏర్పడితే భారతీయ జనతా పార్టీ నాయకుల ఇళ్ల ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఎరువుల కొరత విషయంలో రాష్ట్ర బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు జాగ్రత్తగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# భారత నూతన ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన జనరల్ ధీరజ్ సేథ్



న్యూ ఢిల్లీ, జూన్ 30:భారత సైన్యానికి నూతన అధిపతిగా జనరల్ ధీరజ్ సేథ్ ఈరోజు (మంగళ వారం) బాధ్యతలు స్వీకరించారు. దేశ 31వ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. జనరల్ ఉపేంద్ర ద్వివేది స్థానంలో.. కొత్త ఆర్మీ చీఫ్ కమాండ్ చేపట్టారు. ఆర్మోర్డ్ కార్ప్స్ (ట్యాంక్ రెజిమెంట్) విభాగం నుంచి ఆర్మీ చీఫ్ పదవిని అధిష్ఠించిన 7వ అధికారిగా ధీరజ్ సేథ్ రికార్డు సృష్టించారు. సౌత్ బ్లాక్ లాన్స్‌లో సైనిక సంప్రదాయాల మధ్య అధికారికంగా కొత్త ఆర్మీ చీఫ్ బాధ్యతలు స్వీకరించారు. 1986లో ఆర్మోర్డ్ కార్ప్స్‌లో కమిషన్డ్ అధికారిగా జనరల్ ధీరజ్ సేథ్ ప్రస్థానం ప్రారంభించారు.

జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద నిరోధక దళానికి కమాండర్‌గా పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఆయనకు ఉంది. సైన్యంలో కీలకమైన సదరన్ కమాండ్, సౌత్ వెస్టర్న్ కమాండ్.. రెండింటికీ ఆర్మీ కమాండర్‌గా ధీరజ్ సేథ్ వ్యవహరించారు. రక్షణ విభాగంలో ప్లానింగ్, కేపబిలిటీ డెవలప్‌మెంట్‌లో విశేష అనుభవం.. సైన్యం ఆధునికీకరణపై ప్రత్యేక దృష్టి సారించారు

# రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సంజయ్ జాజు బాధ్యతల స్వీకరణ



హైదరాబాద్, జూన్ 30: : రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా సంజయ్ జాజు, ఐఏఎస్ మంగళవారం డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహించిన కే రామకృష్ణా రావు (ఐఏఎస్) ఈ రోజు పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో 1992 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి సంజయ్ జాజును రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ప్రభుత్వం జూన్ 26న ఉత్తర్వులు జారీ చేసిందని తెలిసిందే.అతిబిఎ ఢ ఒనీఇజీశ్రీ ఉ బీతిటవబ

ఈ ఉత్తర్వుల మేరకు సంజయ్ జాజు నేడు నూతన సీఎస్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, వివిధ శాఖల విభాగాధిపతులు, సచివాలయ అధికారులు, సిబ్బంది సంజయ్ జాజుతోపాటు కే. రామకృష్ణా రావును పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

# భూ యాజమాన్య హక్కులు ఆలయాలకే ఉండాలి: సీఎం రేవంత్



యాదగిరిగుట్ట, జూన్ 30: స్థలాలు ఎవరికి కేటాయించినప్పటికీ, ఆయా భూములపై పూర్తి యాజమాన్య హక్కులు మాత్రం ఆలయాలకే ఉండేలా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమగ్ర అభివృద్ధి, భూ కేటాయింపులపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ భూముల పరిరక్షణ, భక్తుల సౌకర్యార్థం చేపట్టాల్సిన నిర్మాణాలపై అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. యాదగిరిగుట్టలో హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు భూమి కేటాయింపు విషయమై స్పందిస్తూ, సదరు ల్యాండ్‌ను ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారమే కేటాయించాలని సీఎం స్పష్టం చేశారు. అలాగే, ఆలయ పరిధిలో వివిధ మఠాలకు స్థలాలు ఇచ్చే అంశంపై స్పష్టమైన, పారదర్శకమైన విధానాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కుల సంఘాలకు స్థలాల కేటాయింపులపై కూడా నిర్దిష్ట నిబంధనలతో కూడిన ఒక పాలసీని సిద్ధం చేయాలని చెప్పారు.

ఈ భూ కేటాయింపుల ప్రక్రియలో దేశంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుమలలో అనుసరిస్తున్న నిబంధనలు, విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. యాదగిరిగుట్టపై భక్తుల వసతి కోసం నిర్మించతలపెట్టిన అతిథిగృహాల నిర్మాణంలోనూ తిరుమల మోడల్‌నే అనుసరించాలని పేర్కొన్నారు. కొండపై కాటేజీలు, గెస్ట్‌హౌస్‌ల నిర్మాణం చేపట్టేందుకు ఆసక్తి చూపే దాతలు, సంస్థల వివరాలతో కూడిన జాబితాను తక్షణమే రూపొందించాలని, వీరికి విడతలవారీగా నిర్మాణ అనుమతులు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. ఆలయ పరిసరాల్లో భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. యాదగిరిగుట్ట పరిసర ప్రాంతాలను ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం (ఖఖఖ) పద్ధతిలో ఒక ప్రత్యేక టూరిజం సర్క్యూట్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇక యాదగిరిగుట్ట ఆలయ పునర్నిర్మాణ పనులు, నాణ్యతపై గతంలో నిపుణుల కమిటీ సమర్పించిన నివేదికను క్షుణ్ణంగా పరిశీలించి, దానిపై వారం రోజుల్లోగా సమగ్ర నివేదికను తనకు అందజేయాలని ముఖ్యమంత్రి అధికారులకు డెడ్‌లైన్ విధించారు

# విద్యార్థులకు ఊరట.. ఫీజువసూళ్లపై హైకోర్టు స్టే కొనసాగింపు

హైదరాబాద్, జూన్ 30:ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన పిటిషన్లపై విచారణను తెలంగాణ హైకోర్టు వచ్చే జులై 6వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసులో గత విచారణ సందర్భంగా జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులు అప్పటివరకు కొనసాగుతాయని న్యాయస్థానం స్పష్టం చేసింది. గత విచారణలో విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయరాదని పేర్కొంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్-9లోని నాలుగు నిబంధనల అమలుపై తాత్కాలికంగా స్టే విధించింది. హైకోర్టు జారీ చేసిన ఈ మధ్యంతర ఉత్తర్వులు జులై 6వ తేదీ జరిగే తదుపరి విచారణ వరకు అమల్లో ఉంటాయని న్యాయస్థానం స్పష్టం చేసింది.

దీంతో సంబంధిత విద్యాసంస్థలు, విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నెలకొన్న అనిశ్చితికి తాత్కాలిక ఉపశమనం లభించినట్లైంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానానికి సంబంధించిన వివిధ అంశాలపై పిటిషనర్లు కోర్టును ఆశ్రయించిన విషయం విదితమే. ఈ క్రమంలో ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోలోని కొన్ని నిబంధనలపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసింది. జులై 6వ తేదీ జరగనున్న తదుపరి విచారణలో ప్రభుత్వం, పిటిషనర్ల వాదనలను పరిశీలించనుంది. అనంతరం హైకోర్టు మరిన్ని ఆదేశాలు జారీ చేసే అవకాశం ఉంది. ఈ కేసు తీర్పు రాష్ట్రంలోని వేలాది మంది విద్యార్థులు, విద్యాసంస్థలపై ప్రభావం చూపే అవకాశముండటంతో ఆసక్తి నెలకొంది.

# ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ..



కరీమాబాద్, జూన్ 30: ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను జిల్లా కలెక్టర్ డా.సత్య శారద మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, వైద్య సిబ్బంది హాజరు, పారిశుధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన రోగులతో మాట్లాడిన కలెక్టర్, వారికి అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు.

ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులను ఆదేశించారు.

ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచే విధంగా వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు.ఈ తనిఖీలో సంబంధిత మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జి ఎస్ కె ధర్మరాజ్ ,ఆయుర్వేదిక కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అనసూర్య,వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంట్లో ఒక్కసారిగా భారీ పేలుడు.. తప్పిన పెను ప్రమాదం

హైదరాబాద్, జూన్ 30: నగరంలోని సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ పేలుడు తీవ్ర కలకలం రేపింది. రోడ్ నంబర్-4లోని ఓ రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి ఇంటి గోడలు, తలుపులు, కిటికీలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అయితే ఈ పేలుడు ఎలా జరిగిందనేది మిస్టరీగా మారింది. ఇంట్లోని మూడు గ్యాస్ సిలిండర్లు, ఫ్రిజ్, గీజర్ పేలలేదని తేలింది. అలాగే అగ్నిప్రమాద ఆనవాళ్లు కూడా కనిపించలేదు. ఘటన సమయంలో కుటుంబసభ్యులు ఇంట్లోనే ఉన్నారు. వీరంతా ఎలాంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడ్డారు.

రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి దేవేందర్ తన భార్య, కుమారుడితో కలిసి గత 24 సంవత్సరాలుగా అక్కడే ఉంటున్నారు. ఈరోజు(మంగళవారం) ఇంట్లోని వంటగదిలో ఒక్కసారిగా భారీ శబ్దం వినిపించింది. పేలుడు ధాటికి ఇల్లు తీవ్రంగా దెబ్బతిన్నది. సమాచారం అందిన వెంటనే సరూర్‌నగర్ పోలీసులు, హైడ్రా సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని పరిశీలిస్తున్నారు. భారీ పేలుడుకి గల కారణాలపై ఆరా తీస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# అమర్‌నాథ్ యాత్రకు ఉగ్రముప్పు.. అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం..!



న్యూఢిల్లీ, జూన్ 30:అమర్‌నాథ్ యాత్ర ను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు దాడికి పాల్పడే అవకాశం ఉందని భారత ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. దాంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. జూలై 3న ప్రారంభం కానున్న ఈ అమర్‌నాథ్ యాత్రకు భద్రతను మరింత పటిష్టం చేసింది. పాకిస్థాన్ లోని ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతాల్లో కల్లోల పరిస్థితులు నెలకొన్నాయని, వాటి నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ భారత్‌లో అలజడి సృష్టించే అవకాశం ఉందని భారత నిఘా సంస్థలు తెలిపాయి.

ముఖ్యంగా అమర్‌నాథ్ యాత్రను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని, జమ్మూకశ్మీర్‌లో అడవుల్లో దాక్కున్న కొంతమంది ఉగ్రవాదులతో పాక్ మూకలు సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోందని ఇంటెలిజెన్స్ వర్గాలు వెల్లడించాయి. పెద్దఎత్తున దాడులు జరిపేలా వారిని ప్రేరేపించే యత్నాలు జరుగుతున్నాయని భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. ఈ హెచ్చరికల నేపథ్యంలో యాత్ర మార్గంలో భారీగా పోలీసు, భద్రతా బలగాలను మోహరించారు. ఉగ్రవాద వ్యతిరేక నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేశారు. అత్యాధునిక కృత్రిమ మేధ ఆధారిత కెమెరాలు, డిజిటల్ స్కానింగ్ వ్యవస్థలను కూడా ఏర్పాటుచేశారు. యాత్రికుల భద్రతకు ఎలాంటి లోటులేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.

ఇదే సమయంలో జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలో ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. దట్టమైన అటవీ ప్రాంతాల్లో ఆపరేషన్‌లు కొనసాగుతున్నాయని అధికారులు వెల్లడించారు. బలగాలు అప్రమత్తంగా ఉన్నప్పటికీ, యాత్రికులు కూడా అధికారిక సూచనలు పాటించాలని, వదంతులను నమ్మవద్దని భద్రతా వర్గాలు సూచిస్తున్నాయి.

# యూరప్ మండిపోతోంది.. వడగాల్పులకు పది రోజుల్లో 1300 మంది మృతి

న్యూ ఢిల్లీ, జూన్ 30:యూరప్ ఎండలతో అట్టుడికిపోతోంది. అక్కడ సగటు ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ పైనే నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు వడగాలులు, ఉక్కపోత, వడదెబ్బలతో అల్లాడుతున్నారు. తీవ్రమైన ఎండలు, వడగాలుల కారణంగా యూరప్‌లో 1,300 మందికిపైగా మరణించినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా. ఎండల కారణంగా సాధారణ జనజీవితం స్తంభించిపోయింది. ప్రజలు ఇండ్లల్లోంచి బయటకు రావడానికే భయపడుతున్నారు. ఎండ ప్రభావానికి గురైన వారికి అత్యవసర సేవలు అందించేందుకు అక్కడి సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది.

డిమాండ్‌కు తగ్గట్లుగా సేవలు అందించలేకపోతున్నారు. వృద్ధులు, పిల్లలు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు అధికంగా ఇబ్బందులు పడుతున్నారు. యూరప్‌లోని అనేక దేశాలు ఎండ, వడగాల్పుల ప్రభావానికి గురవుతున్నాయి. జర్మనీలో అత్యధికంగా గత ఆదివారం 41.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఫ్రాన్స్‌లో 43.3 డిగ్రీలు, బ్రిటన్‌లో 38.8 డిగ్రీల ఎండ నమోదైంది. 1950 తర్వాత ఈ రేంజ్‌లో ఎండలు పెరగడం ఇదే మొదటిసారి. సగటున యూరప్‌లో వేసవిలో 20-27డిగ్రీల ఉష్ణోగ్రతలు మాత్రమే నమోదవుతుంటాయి. అలాంటిది 40 డిగ్రీలకు పైగా టెంపరేచర్ పెరగడంతో స్థానికులు తట్టుకోలేకపోతున్నారు. మరోవైపు రాత్రిపూట ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్నాయి.

రాత్రి ఉష్ణోగ్రతలు 20 డిగ్రీలకుపైనే నమోదవుతున్నాయి. దీంతో పగలూ, రాత్రి అనే తేడా లేకుండా ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రపంచ సగటు ఉష్ణోగ్రతలతో పోలిస్తే యూరప్ ఉష్ణోగ్రతలు వేగంగా పెరుగుతున్నాయని నిపుణులు అంటున్నారు. గత పది రోజుల్లోనే యూరప్ వ్యాప్తంగా 1300 మందికిపైగా ఎండల కారణంగా మరణించారు.

వీరిలో పిల్లలు, యువత, వృద్ధులు, మహిళలు కూడా ఉన్నారు. ఫ్రాన్స్, జర్మనీ, బెర్లిన్ వంటి దేశాలు అధికంగా ఎండ ప్రభావానికి గురవుతున్నాయి. వడదెబ్బ బాధితులతో ఆస్పత్రులు నిండిపోతున్నాయి. కొన్నిచోట్ల వారికి తగిన వైద్యం అందించలేనంతగా ఆస్పత్రుల్లో డిమాండ్ పెరిగిపోయింది.

2022 నుంచి అక్కడ ఎండలు బాగా పెరిగిపోతున్నాయి. ఈ ఐదేళ్లో ఎండల కారణంగా అక్కడ 60,000 మంది మరణించారు. యూరప్ శీతల ఖండం. అందువల్ల అక్కడి ఇండ్లు, ఇతర నిర్మాణాలు వెచ్చగా ఉండేందుకు డిజైన్ చేశారు. దీంతో ఇంట్లోని వారు కూడా త్వరగా ఎండ ప్రభావానికి గురవుతున్నారు.

# చిగురుమామిడిలో ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు డీఐఈవో పాఠ్యపుస్తకాల పంపిణీ

కరీంనగర్, జూన్ 30: చిగురుమామిడి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా ఇంటర్ విద్యాధికారి వీ ఆంజనేయరావు నూతనంగా అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఉచిత పుస్తకాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎటువంటి చెడు వ్యసనాలకు లోను కాకుండా, కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు.

అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శశిధర్ శర్మ గత సంవత్సరం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమాలను డీఐఈవోకు ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. కళాశాలలో అడ్మిషన్ల సంఖ్య 100కు చేరినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

కళాశాలలో ఉత్తమ ఫలితాలను తీసుకువచ్చిన ప్రిన్సిపల్, కళాశాల అధ్యాపక బృందమును డీఐఈవో అభినందించారు.

# విజయవాడలో ఘోర రోడ్డు ప్రమాదం.. నాలుగేళ్ల చిన్నారితో పాటు ఇద్దరి మృతి

అమరావతి, జూన్ 30: జిల్లాలోని బీబీగూడెం వద్ద ఉన్న పశ్చిమ బైపాస్ రోడ్డులో ఈరోజు(మంగళవారం) ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా దూసుకొచ్చిన కంటైనర్.. కారును వెనక నుంచి ఢీకొట్టడంతో.. ముందున్న ట్యాంకర్‌ను ఆ కారు బలంగా ఢీకొట్టింది. ఈ క్రమంలో కంటైనర్, ట్యాంకర్ మధ్యలో కారు నుజ్జునుజ్జైంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో నాలుగేళ్ల చిన్నారి చనిపోవడం తీవ్రంగా కలిచివేసింది. ఇదే ప్రమాదంలో ఎదురుగా వెళ్తున్న బైక్‌ను కూడా ట్యాంకర్ బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి కూడా దుర్మరణం చెందాడు.

ప్రమాదం జరిగిన తీరు చూసి స్థానికులు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. కంటైనర్, ట్యాంకర్‌కు మధ్యలో కారు నామరూపాలు లేకుండాపోయింది. మృతదేహాలు కారు లోపలే ఇరుక్కుపోయిన పరిస్థితి. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని పొక్లెయినర్ సాయంతో కారును బయటకు తీసి.. అందులో నుంచి మృతదేహాలను వెలికితీశారు. ఈ ప్రమాదంపై గన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కంటైనర్ డ్రైవర్ అతివేగంగా వచ్చి ఢీకొట్టడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఆ ప్రాంతంలో సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాద విషయాన్ని కుటుంబసభ్యులకు తెలియజేశారు.

# దైవ సమానులు వైద్యులు

## (01 జూలై "జాతీయ వైద్యుల దినోత్సవం" సందర్భంగా)



వైద్యులు దేవుళ్లతో సమానం. అమ్మానాన్నలు జన్మనిస్తే అనారోగ్య సమయంలో ప్రాణాలు నిలుపుతూ వైద్యులు పునర్జన్మనిస్తారు. స్వచ్ఛమైన తెల్లని కోటు, ఆత్మీయ చెరగని చిరునవ్వు, మొక్కవోని నిబ్బరం, అలుపెరుగని అంకిత భావం, విసుగెరుగని వృత్తి నిబద్ధత, స్వస్థత వర్షించే స్పర్శలు, రోగుల పాలిటి దైవ హస్తాలు, ధైర్యాన్ని నూరిపోసే వాక్చాతుర్యాలు, కరుణ కుమ్మరించే సుగుణాలు లాంటి అనేక ఆదర్శ వ్యక్తిత్వ లక్షణాలు కలిగిన వైద్యులు మన ముందు కనిపిస్తున్న దైవ స్వరూపాలు. వైద్యులు వేసే ప్రతి అడుగు, మాట్లాడే ప్రతి పదం, చేసే ప్రతి చికిత్స, ఇచ్చే ప్రతి సలహా లాంటివి అన్నీ రోగులకు ఆరోగ్య భాగ్యం కలిగించడానికే అంకితం అని తెలుసుకోవాలి. వైద్యుల మానవీయ సంబంధాలు, పాటించే జీవన/వృత్తిపరమైన విలువలు, ఆధునిక వైద్య శాస్త్ర పరిజ్ఞానం, అపార త్యాగ గుణం, తన శ్రేయస్సును పక్కనపెట్టి రోగుల శ్రేయస్సుకు పాటుపడే నిస్వార్థ జీవి ఓ అసాధారణ వైద్యుడు. కరోనా లాంటి విపత్తుల సమయంలో తమ ప్రాణాలను అడ్డుపెట్టి కోట్ల మందికి పునర్జన్మను ఇచ్చిన వైద్యుల అమూల్య సేవలకు తత్సమాన్ని లేదు, వైద్యుడికి ప్రత్యామ్నాయం లేదు.

### జాతీయ వైద్యుల దినోత్సవం-2026 :

పశ్చిమ బెంగాల్ 2వ సిఎంగా సేవలు అందించిన భారత రత్న డా: బిధన్ చంద్ర రాయ్ లేదా డా : బి. సి. రాయ్ జన్మదినం (01 జూలై 1882), వర్ధంతి (01 జూలై 1962) సందర్భంగా భారత దేశవ్యాప్తంగా 01 జూలై రోజున "జాతీయ వైద్యుల దినోత్సవం (నేషనల్ డాక్టర్స్ డే)" పాటించుట ఆనవాయితీగా మారింది. ప్రఖ్యాత ఫిజీసియన్‌గా వైద్య సేవలు అందించిన డా: బి సి రాయ్ చొరవతో ఇండియన్ మెడికల్ కౌన్సిల్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్లు ప్రారంభం కావడం విశేషం. త్యాగ నిరతి, వృత్తి నిబద్ధత, ప్రేమ మూర్తి అనే పదాలకు నిదర్శనం వైద్యులు మాత్రమే. 2026 జాతీయ వైద్యుల దినోత్సవం ఇతివృత్తంగా "బిహైండ్ ది మాస్క్ : హూ హీల్స్ ది హీలర్స్" అనే అంశాన్ని తీసుకొని సమాజ ఆరోగ్య పరిరక్షణకు అవిశ్రాంతంగా కృషి చేస్తున్న వైద్యుల మానసిక, శారీరక, వృత్తిపరమైన సమస్యలను కూడా అర్థం చేసుకోవాలని ప్రచారం నిర్వహిస్తున్నారు.

### వైద్యుల ప్రధాన విధులు:

పేదరికం, నిరక్షరాస్యత, అధిక జనాభా, నిరుద్యోగం లాంటి ప్రధాన సమస్యలు భారతీయులకు అనారోగ్య సమస్యలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా పలు సవాళ్లను ఎదుర్కొంటూనే, అధిక పని గంటలు పని చేస్తూ, శారీరక అలసట, మానసిక ఒత్తిడిని పక్కన పెట్టి రోగులకు వైద్యం చేయడంలోనే దృష్టిని కేంద్రీకరించే వైద్యుల మానసిక స్థితిని అర్థం చేసుకున్న వారికి డాక్టర్లపై అపారమైన ప్రేమాభిమానాలు జనిస్తాయి. పౌర సమాజ ఆరోగ్యమే ఆయనకు ఆనందానిస్తుంది. రోగులకు వ్యాధి నయం అయితే వైద్యులు అపూర్వ విజయంగా భావిస్తారు. రోగుల వేదనలు తన మనసును కలిచి వేస్తాయి. అధిక పని గంటలు, విశ్రాంతి లేని వృత్తి నిబద్ధతలను ప్రదర్శించే వైద్యులు రోగుల పాలిటి ఆపన్నహస్తాలు, ఆయురారోగ్య ప్రదాతలు. రోగాలను నయం చేయడం మాత్రమే కాకుండా ఆత్మ విశ్వాసం నింపే అద్భుత మాటలు, సకాలంలో రోగ లక్షణాలను బట్టి వైద్య చికిత్స చేయడం, దీర్ఘకాలిక రోగాలకు ఉపశమనం కల్పించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని వివరించడం, వ్యాధుల వ్యాప్తి పట్ల అవగాహన కల్పించడం, రోగాల నివారణకు మార్గాలను చూపడం, భావోద్వేగ మద్దతు ఇవ్వడం, రోగులకు తగు సూచనలు చేయడం, అత్యవసర వైద్య సేవలను అందించడం, ఆరోగ్యకర పౌర సమాజాన్ని నిర్మించడం, రోగికి మానసిక/శారీరక సాంత్వన కల్పించడం లాంటి లక్ష్యాలతో వైద్యులు అద్వితీయ అసమాన సేవలను అందిస్తున్నారు.

### జాతీయ వైద్యుల దినోత్సవ కార్యక్రమాలు:

జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మన కుటుంబ వైద్యులను కలిసి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలపడం, తగు రీతిలో డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియజేయడం, ప్రేమగా బహుమతులు అందజేయడం, సామాజిక మాధ్యమాల్లో వైద్య వృత్తి పట్ల అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం, మన ఊరు వాడల్లో వైద్యులను సన్మానించుకోవడం లాంటి పలు కార్యక్రమాలను నిర్వహించవచ్చు.

భవిష్యత్తుపై ఆశలను కలిగించడం, రోగుల శ్రేయస్సుకు పాల్పడడం, రోగుల్లో విశ్వాసం నింపడం లాంటివి నిరంతరం తమ విధులుగా భావిస్తున్న ఆదర్శ వైద్యులకు వందనాలు, వారి సేవలకు శతకోటి కృతజ్ఞతలు. ప్రతి 1,000 మంది జనాభాకు ఒక వైద్యుడు, ముగ్గురు నర్సులు ఉండాలి. నేడు భారతంలో ప్రతి 1,456 మందికి ఒక వైద్యుడు, 1.7 నర్సులు మాత్రమే ఉన్నారు. మన దేశంలో వైద్యులు, నర్సుల కొరత ఉండడంతో వైద్యం అందరికీ అందడం లేదు.

పొడిగించబడిన పని గంటలు, భావోద్వేగ సమస్యలు, శారీరక అలసట, మానసిక ఒత్తిడి, పరిమిత వనరులు, చట్టబద్ధమైన సమస్యలు, విలువలతో కూడిన వృత్తి నిబద్ధతలు లాంటి సవాళ్ల నడుమ వైద్యవృత్తి ఒక చాలెంజిగ్ వృత్తిగా మారుతున్నది.

రోజురోజుకు వృత్తిలో వస్తున్న సాంకేతిక మార్పులను ఆకళింపు చేసుకుంటూ ప్రాణాలను కాపాడాలనే ఏకైక లక్ష్యంతో తమ జీవితాలను ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి అంకితం చేస్తున్న వైద్యులు సదా ప్రశంసనీయులు, అభినందనీయులు.



-మధుపాళీ
9949700037

# 'మాదకద్రవ్యాలు వద్దు' అనేది దేశవ్యాప్త ఉద్యమంగా మారాలి: ఉపరాష్ట్రపతి

న్యూ ఢిల్లీ, జూన్ 30: భారత్‌ను మాదకద్రవ్య రహిత దేశంగా (నషా ముక్త్ భారత్) మార్చేందుకు విద్యాసంస్థలు, కుటుంబాలు, ఆరోగ్య నిపుణులు, చట్టాన్ని అమలు చేసే సంస్థలు, పౌర సమాజం కలిసికట్టుగా పనిచేయాలని భారత ఉపరాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా జరిగే ఈ పోరాటం వ్యక్తులతో ప్రారంభమై దేశవ్యాప్త ఉద్యమంగా ఎదగాలని ఆయన పేర్కొన్నారు.

బెంగళూరులోని శ్రీ కంఠీరవ స్టేడియంలో రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (ఆర్‌జీయూహెచ్‌ఎస్) 31వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల సందర్భంగా నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, దిశ బోధ్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన 'నషా ముక్త్ భారత్ సదస్సు'లో ఉపరాష్ట్రపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల వ్యసనం కేవలం ఒక వ్యక్తి ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా వారి విద్యాభ్యాసాన్ని, ఉత్పాదకతను, సామాజిక సమైక్యతను, దేశాభివృద్ధిని సైతం తీవ్రంగా దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆర్‌జీయూహెచ్‌ఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా విశ్వవిద్యాలయానికి అభినందనలు తెలిపిన ఉపరాష్ట్రపతి.. వైద్య విద్య, పరిశోధనలు, ప్రజారోగ్య రంగాలకు ఆ విశ్వవిద్యాలయం అందించిన విశేష సేవలను కొనియాడారు. దేశ సేవకు అంకితమైన ఎన్నో తరాల ఆరోగ్య నిపుణులను ఈ విశ్వవిద్యాలయం తీర్చిదిద్దిందని ఆయన ప్రశంసించారు.

బెంగళూరు, కర్ణాటకతో పాటు యావత్ భారతదేశాన్ని మాదకద్రవ్య రహితంగా మారుస్తామని భారీ సంఖ్యలోని విద్యార్థులు ప్రతిజ్ఞ చేయటం పట్ల శ్రీ సీపీ రాధాకృష్ణన్ హర్షం వ్యక్తం చేశారు. 'నషా ముక్త్ భారత్' అంటే కేవలం మాదకద్రవ్యాలు అందుబాటులో లేకపోవడం మాత్రమే కాదని.. ఆరోగ్యకరమైన అలవాట్లను, సరైన నిర్ణయాలను ప్రోత్సహించడం, అండగా నిలిచే కుటుంబాలను, దృఢమైన సమాజాలను నిర్మించడం అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ మనస్సుపై పూర్తి నియంత్రణ కలిగి ఉండాలని ఆయన సూచించారు. ఎప్పుడైతే మాదకద్రవ్యాలు మనస్సును నియంత్రిస్తాయో అప్పుడు మనిషి తన జీవితంపై నియంత్రణను కోల్పోతాడని ఆయన వ్యాఖ్యానించారు.

వ్యసనాల వల్ల కోల్పోయే ప్రతి యువ జీవితం దేశ సామర్థ్యానికి తీరని లోటని ఉపరాష్ట్రపతి ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా భవిష్యత్తు వైద్యులు, నర్సులు, ఫార్మసిస్టులు, మనో వైజ్ఞానిక నిపుణులు, పరిశోధకులు, ప్రజారోగ్య నిపుణులుగా మారబోతున్న విద్యార్థులంతా అవగాహన పెంచే ప్రచారకర్తలుగా మారాలని ఆయన పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల వ్యసన సమస్యను పరిష్కరించడంలో నివారణ, చికిత్స, పరిశోధన, సాక్ష్యాధారాలతో కూడిన విధాన రూపకల్పనలో వారు అగ్రభాగాన నిలవాలని కోరారు.

వ్యసన విముక్తి వైద్యం, మానసిక ఆరోగ్యం, ప్రవర్తనకు సంబంధించిన విజ్ఞాన శాస్త్రాలు, సామాజిక జోక్యంపై మరిన్ని పరిశోధనలు జరగాలని ఆయన సూచించారు. మన చర్యలకు పరిశోధనల నుంచి లభించే సాక్ష్యాధారాలే దిక్సూచి కావాలని.. పరిశోధనల ఆధారంగానే ప్రభుత్వ విధానాలు రూపొందాలని ఆయన చెప్పారు. మత్తు పదార్థాలను తీసుకోవటం వల్ల వచ్చే రుగ్మతలను అరికట్టడంలో సాంకేతికత, కౌన్సెలింగ్ సేవలు, తోటివారి మద్దతు నెట్‌వర్క్‌లను సమర్థవంతంగా ఉపయోగించుకోవాల్సిన అవసరాన్ని ఆయన పేర్కొన్నారు.

మాదకద్రవ్యాల రహిత విద్యాసంస్థలపై తనకు ఉన్న నిరంతర నిబద్ధతను ఉపరాష్ట్రపతి ఈ సందర్భంగా గుర్తు చేశారు. తాను మూడు కేంద్ర విశ్వవిద్యాలయాలకు ఛాన్సలర్‌గా వ్యవహరిస్తున్నట్లు తెలిపిన ఆయన.. ఆయా ప్రాంగణాలను మాదక ద్రవ్య రహితంగా మార్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ప్రారంభించిన 'మాదకద్రవ్య రహిత క్యాంపస్ కార్యక్రమం', 'డిజిటల్ ప్రతిజ్ఞ వేదిక'ను ప్రస్తావించిన ఆయన.. ఆయా విద్యా సంస్థల్లో మాదక ద్రవ్య రహిత వాతావరణాన్ని సృష్టించడంలో ఇవి విజయం సాధించటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ వేడుకల్లో భాగంగా కర్ణాటకలో జరుగుతున్న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (ఆర్‌జీయూహెచ్‌ఎస్) అభివృద్ధి, ప్రగతికి ఇన్నేళ్లుగా అమూల్యమైన సేవలు అందించిన ఆ విశ్వవిద్యాలయ మాజీ వైస్-ఛాన్సలర్లను ఆయన ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో కర్ణాటక గవర్నర్ శ్రీ థావర్ చంద్ గెహ్లాట్, కర్ణాటక ముఖ్యమంత్రి శ్రీ డీకే శివకుమార్, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ (విశ్రాంత) సయ్యద్ అబ్దుల్ నజీర్, కర్ణాటక వైద్య విద్యా శాఖ మంత్రి డాక్టర్ శరణ్ ప్రకాష్ ఆర్. పాటిల్, కర్ణాటక ఆరోగ్య- కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ యూ.టీ ఖాదర్ ఫరీద్, ఆర్‌జీయుూహెచ్‌ఎస్ వైస్-ఛాన్సలర్ డాక్టర్ భగవాన్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## రెడీ మిక్స్ లారీని ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు.. ఇద్దరు డ్రైవర్లకు తీవ్ర గాయాలు..!




నల్గొండ, జూన్ 30:విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. నల్గొండ జిల్లా కట్టంగూర్ మండలం ముత్యాలమ్మగూడెం వద్ద మంగళవారం ఉదయం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రైవేటు ట్రావెల్స్ బస్సు రెడీమిక్స్ లారీని ఢీకొట్టింది. ట్రావెల్స్ బస్సు భీమవరం నుంచి హైదరాబాద్ వస్తుండగా టైరు పేలడంతో అవతలివైపు వస్తున్న లారీని ఢీకొట్టింది.ఉ వనీణతీజీజూష్ట్రతిఇ ఖీవటవతీవనిఇవ

ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్, లారీ డ్రైవర్ ఇద్దరికీ గాయాలయ్యాయి. ఘటనపై స్థానికుల ద్వారా సమాచారం అందగానే పోలీసులు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై కట్టంగూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎస్ఐఆర్ ఓటర్ సర్వేకు సహకరించాలి

ఆదిలాబాద్, జూన్ 30: కడెం మండలంలోని పెద్ద బెల్లాల్ గ్రామంలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఓటర్ సర్వేకు గ్రామ ప్రజలందరూ సహకరించాలని గ్రామ సర్పంచ్ ఈదుల తిరుపతి కోరారు. మంగళవారం స్థానిక బీఎల్ఓ షహనాజ్ బేగంతో కలిసి ఇంటింటికి వెళ్లి ఓటర్లకు సర్వే ప్రాముఖ్యతను వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకుని, అవసరమైన ధ్రువపత్రాలను స్థానిక బీఎల్ఓకు అందజేసి సర్వేను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సంఘం పారదర్శకంగా, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. బీఎల్ఓ షహనాజ్ బేగం ఎస్ఐఆర్ ఫారాలు నింపే విధానం, అవసరమైన పత్రాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించగా, ప్రజలు సర్వేకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

## ప్రధానమంత్రికి 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హ్వారైజన్' పురస్కారంతో సీషెల్స్ సత్కారం

న్యూఢిల్లీ, జూన్ 30:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీని సీషెల్స్ అధ్యక్షుడు గౌరవనీయ డాక్టర్ పాట్రిక్ హర్మినీ ఇవాళ 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హ్వారైజన్' విశిష్ట పురస్కారంతో సత్కరించారు. కాలుష్య రహిత భూగోళం లక్ష్యంగా నాయకత్వం వహిస్తున్నందుకు, వర్ధమాన దేశాల ప్రయోజనాల కోసం గళమెత్తిన ఆయనను ఓ ప్రత్యేక కార్యక్రమంలో ఈ బిరుదుతో గౌరవించారు. అలాగే, నీలి ఆర్థిక వ్యవస్థ వికాసం, వాతావరణ ప్రభావ ఉపశమన చర్యలు, సముద్ర వనరుల సుస్థిర నిర్వహణ, వర్ధమాన చిన్న ద్వీపదేశాల అభివృద్ధి ఆకాంక్షలను ప్రోత్సహించడంలో ఆయన దీర్ఘకాలిక నిబద్ధతకు గుర్తింపుగా ప్రధానమంత్రికి ఈ గౌరవం లభించింది. ఈ విశిష్ట పురస్కారం ప్రత్యేకంగా ఏర్పరచి, ఒక అంతర్జాతీయ నాయకుడికి ప్రదానం చేయడం ఇదే తొలిసారి.

ఈ పురస్కార ప్రదానంపై ప్రధానమంత్రి శ్రీ మోదీ స్పందిస్తూ- పైపర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పు దుష్ప్రభావాలపై పోరుకు నిబద్ధతతో కృషి చేస్తున్న దేశాలకు దీన్ని అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాల స్వర్ణోత్సవ సందర్భంలో లభించిన ఈ గుర్తింపు ఉభయ పక్షాల ప్రత్యేక స్నేహబంధం మరింత పెనవేసుకోవడానికి ఎంతగానో దోహదపడుతుందని ఆయన వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ సౌర కూటమి (ఐఎస్ఏ), పర్యావరణం కోసం జీవనశైలి (మిషన్ లైఫ్), తల్లి పేరిట ఓ మొక్క (ఏక్ పెడ్ మా కే నామ్) అంతర్జాతీయ పులిజాతి సంరక్షణ కూటమి (ఐబీసీఏ) సహా కాలుష్య రహిత భూగోళం లక్ష్యంగా చిరకాలం నుంచీ ప్రధానమంత్రి చేస్తున్న కృషికి ఈ పురస్కారంతో సీషెల్స్ అత్యున్నత గుర్తింపునిచ్చింది. సుస్థిర ప్రగతికి దీర్ఘకాలిక ప్రోత్సాహం నేపథ్యంలో ప్రధానమంత్రికి లభించిన సత్కార పరంపరలో ఇది తాజా పురస్కారం. ఇప్పటికే ఆయన 'ఎఫ్ఏఓ' వారి అగ్రికోలా పతకం, సియోల్ శాంతి బహుమతి, ఐక్యరాజ్య సమితి 'చాంపియన్ ఆఫ్ ది ఎర్త్' వంటి పురస్కారాలు అందుకున్నారు.

సామర్థ్య వికాసం, పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి కార్యక్రమాలు, హిందూ మహాసముద్ర ప్రాంతంలో సమష్టి ప్రాథమ్యాలకు పెద్దపీట వేయడం వంటి అంశాల్లో వర్ధమాన దేశాల విశ్వసనీయ భాగస్వామిగా భారత్ పోషిస్తున్న పాత్రకు తానిస్తున్న ప్రాధాన్యాన్ని ఈ పురస్కారం ద్వారా సీషెల్స్ చాటుకుంది.

## 108 అంబులెన్స్‌లో ప్రసవం.. తల్లి, శిశువు క్షేమం



ఆదిలాబాద్, జూన్ 30: కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని చింతకర్ర గ్రామానికి చెందిన గర్భిణి పూర్కా అనసూయకు మంగళవారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు.

వెంటనే అక్కడికి చేరుకున్న 108 ఈఎంటి సీహెచ్ రవి, పైలెట్‌తో కలిసి ఆమెను కేరమెరి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలిస్తుండగా, మార్గమధ్యంలోనే పురిటి నొప్పులు తీవ్రం కావడంతో అంబులెన్స్‌లోనే సురక్షితంగా ప్రసవం నిర్వహించారు. ఆమె ఆడ శిశువుకు జన్మనిచ్చింది.

అనంతరం తల్లి, శిశువును ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించగా ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు ఈఎంటి సీహెచ్ రవి తెలిపారు.

అత్యవసర పరిస్థితిలో సమయస్ఫూర్తితో సురక్షిత ప్రసవం నిర్వహించిన 108 ఈఎంటి, పైలెట్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్‌పై కేంద్ర దృష్టి సారించాలి



ఖమ్మం, జూన్ 30: బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తెలంగాణ పర్యటన సందర్భంగా సోమవారం వరంగల్‌లో నిర్వహించిన పార్టీ సమావేశం రాష్ట్ర నాయకత్వంలో నూతనోత్సాహాన్ని నింపింది. పార్టీ సంస్థాగత బలోపేతం, బూత్ కమిటీల విస్తరణ, ప్రజా సమస్యలపై ఉద్యమాలు, రానున్న ఎన్నికల వ్యూహాలపై జరిగిన కీలక సమావేశాల్లో భారతీయ జనతా పార్టీ జాతీయ సభ్యుడు, తమిళనాడు?కర్ణాటక రాష్ట్రాల సహ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి పాల్గొని జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్ వ్యవహారాన్ని ఆయన జాతీయ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లి పూర్తి వివరాలను వివరించారు.


కేంద్ర ప్రభుత్వ ప్రధానమంత్రి కిసాన్ సంపద యోజన కింద సుమారు రూ.109.59 కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు చేస్తున్న ఈ మెగా ఫుడ్ పార్క్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.49.79 కోట్ల గ్రాంట్ మంజూరు చేసిందని, రైతుల నుంచి సేకరించిన సుమారు 200 ఎకరాల భూమిపై వ్యవసాయ ఉత్పత్తుల విలువ ఆధారిత ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేయడం, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడం, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు సృష్టించడం ఈ ప్రాజెక్ట ప్రధాన లక్ష్యాలని పొంగులేటి వివరించారు.

అయితే ప్రాజెక్ట అమలు, భూకేటాయింపులు, కేంద్ర నిధుల వినియోగం, ప్రైవేటు సంస్థలకు అప్పగింపు ప్రక్రియలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు ఉన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని సమగ్ర దర్యాప్తు చేపట్టాలని, అవసరమైతే సంబంధిత కేంద్ర దర్యాప్తు సంస్థల ద్వారా విచారణ జరిపించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పొంగులేటి సుధాకర్ రెడ్డి వినతిపై జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సానుకూలంగా స్పందించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. రైతుల ఆకాంక్షలకు అనుగుణంగా బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్‌ను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, కేంద్ర నిధులు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగానే వినియోగించబడేలా అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నారపరాజు రామచంద్రరావు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, జాతీయ ఓబీసీ అధ్యక్షుడు కోవా లక్ష్మణ్, అభయ్ పాటిల్, అసెంబ్లీలో బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మహారాష్ట్ర సమాచార సాంకేతిక శాఖ మంత్రి ఆశిష్ షేలార్‌తో పాటు పార్టీ రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. తెలంగాణలో పార్టీ బలోపేతంతో పాటు ప్రజా సమస్యలను జాతీయ స్థాయిలో ప్రస్తావించే దిశగా ఈ సమావేశం కీలకంగా నిలిచిందని పార్టీ నాయకులు పేర్కొన్నారు.

ఆహ్వానము
జి.వి.ఆర్. ఆరాధన కల్చరల్ ఫౌండేషన్
డా॥రావూరి భరద్వాజ జయంత్యోత్సవం

జ్ఞానపీఠ పురస్కార స్వీకర్త డా॥రావూరి భరద్వాజ స్మారక సాహితీ పురస్కారాన్ని శ్రీ పరవస్తు లోకేశ్వర్ గారికి
శ్రీమతి రావూరి కాంతమ్మ స్మారక సేవా పురస్కారాన్ని శ్రీమతి హరిప్రియ గారికి ప్రదానం

పురస్కార స్వీకర్తలు
శ్రీ పరవస్తు లోకేశ్వర్



సాహిత్యం 10,000/- రూపాయల నగదు పురస్కారం

శ్రీమతి హరిప్రియ



సంగీతం 5000/- రూపాయల నగదు పురస్కారం

ముఖ్యఅతిథి : డా॥పాలకుర్తి మధుసూదనరావు, పూర్వ సి.ఇ.ఒ.శ్రీ వేంకటేశ్వర భక్తిఛానల్, టి.టి.డి.
సభాధ్యక్షులు : శ్రీ బైస దేవదాసు, సంపాదకులు, నేటినిజం దినపత్రిక
ఆత్మీయ అతిథి : శ్రీమతి కేతవరపు రాజ్యశ్రీ, సాహితీవేత్త
సభాప్రారంభం : శ్రీ పొత్తూరి సుబ్బారావు, సంపాదకులు, సాహితీకిరణం
అతిథిసత్కారం : శ్రీ రావూరి వెంకట కోటేశ్వరరావు, ధర్మకర్త (ట్రస్టీ), డా॥రావూరి భరద్వాజ - రావూరి కాంతమ్మ ట్రస్ట్
సభానిర్వహణ : శ్రీ పెద్దూరి వెంకటదాసు, కవి, రచయిత

సాంస్కృతిక కార్యక్రమం
చిన్నారి శ్రీధృతి తిమ్మరాజుచే 'రామాయణశబ్దం' కూచిపూడి నృత్యం
&
కోమల సమన్విత కూచిపూడి నృత్యాలయంవారి కూచిపూడి నృత్యం

తేది:05.07.2026, ఆదివారం సా॥5.00గం॥లకు
కళాలలిత కళావేదిక (శ్రీ త్యాగరాయ గానసభ), చిక్కడపల్లి, హైదరాబాద్
లయన్ వి.వి.రాఘవరెడ్డి
ప్రధాన కార్యదర్శి : 9866332738

# ఫిషరీస్ కాలనీ పాఠశాలకు రూ.14 వేల విద్యాసామగ్రి పంపిణీ



ఖమ్మం, జూన్ 30:వైరా ఫిషరీస్ కాలనీ ప్రభుత్వ పాఠశాలకు హైదరాబాద్‌లోని డీఆర్‌డీఓ అబ్దుల్ కలాం మిస్సైల్ కాంప్లెక్స్‌లో శాస్త్రవేత్తగా పనిచేస్తున్న సుందర్ నేతృత్వంలోని అప్నా పరివార్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూ.14 వేల విలువైన విద్యాసామగ్రిని మంగళవారం పంపిణీ చేశారు. మండల విద్యాశాఖ అధికారి చావా శ్రీనివాసరావు, 7వ వార్డు కౌన్సిలర్ పణితి సైదులు, ఏఏపీసీ చైర్మన్ ఆది రజని విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేశారు.

ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెలిశెట్టి నరసింహారావు తన మిత్రులు, దాతల సహకారంతో పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులు, విద్యా సామగ్రిని సమకూరుస్తూ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని ప్రశంసించారు. సుందర్ దాతృత్వాన్ని అభినందిస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత మందికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు పూర్తయిన చెన్నూరు కో- ఆప్షన్ సభ్యుల ఎంపిక




ఆదిలాబాద్, జూన్ 30:ఎప్పుడెప్పుడు అని ఎదురు చూస్తున్నా చెన్నూరు మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుల ఎంపిక మంగళవారం మున్సిపల్ చెర్‌పర్సన్ పెద్దింటి పద్మ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన మున్సిపాటి సాధారణ సమావేశంలో మంత్రి వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు పూర్తయింది. చెన్నూరు మున్సిపాల్టీ పాలకవర్గం ఎన్నికల అనంతరం మున్సిపాలిటీ గాను నాలుగు కో ఆప్షన్ సభ్యులు కేటాయించి ఉండగా రెండు నెల క్రితం నోటిఫికేషన్ విడుదల కాగా 17 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

దరఖాస్తుల స్వీకరణ అనంతరం మంత్రి ఆదేశాల మేరకు కొంతమంది మాజీ కౌన్సిలర్లతో పాటు పార్టీ లో చేరిన కొత్త నాయకులకు చోటు కల్పిస్తూ రహస్యలేఖ ద్వారా మున్సిపల్ కార్యాలయానికి సందేశం వచ్చినప్పటికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్తలు, నాయకుల వ్యతిరేక కారణంగా రెండు నెలలుగా సభ్యుల నియామకాం వాయిదాపడుతూ వచ్చింది. ఇవ్వాళ మంత్రి వివేక్ ఆదేశానుసారం మున్సిపల్ సాధారణ సమావేశంలో తనుగుల సరోజన, సాధనబోయిన కృష్ణ (మాజీ సర్పంచ్ ), ఖలీల్ ఖాజాబేగం, సయ్యద్ సాహీర్ లను కో ఆప్షన్ సభ్యులుగా నియమించారు.

# 'పీఎమ్ ఫ్యామిలీ కేర్ ట్రాకర్' ప్రయోగాత్మక ప్రాజెక్టును గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ప్రారంభించిన కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా..

న్యూఢిల్లీ, జూన్ 30: 'పీఎమ్ ఫ్యామిలీ కేర్ ట్రాకర్' ప్రయోగాత్మక ప్రాజెక్టును కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఈ రోజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గుజరాత్ ముఖ్యమంత్రి శ్రీ భూపేంద్ర పటేల్, కేంద్ర హోం కార్యదర్శి శ్రీ గోవింద్ మోహన్‌తో పాటు అనేక మంది ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ప్రసంగిస్తూ స్వాతంత్ర్యం వచ్చిన తరువాతి భారత్ 100 సంవత్సరాల చరిత్రను ఎవరైనా రాస్తే, ఆ చరిత్ర రెండు భాగాలుగా ఉంటుందన్నారు. ఒకటో భాగం 2014కు ముందు భారత్ గురించీ, రెండో భాగం 2014 కు తరువాత భారత్ గురించీ ఉంటుందని ఆయన అన్నారు. 2014 ఎన్నికల్లో భారతదేశ ప్రజానీకం అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారిని దేశ ప్రధానమంత్రిగా ఎన్నుకున్నారన్నారు. 2014 తరువాత, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో, దేశంలోని ప్రతి రంగంలో నూ భారీ మార్పు చోటు చేసుకొందన్నారు. దేశ సమగ్ర, సర్వతోముఖ అభివృద్ధికి ప్రధాని శ్రీ మోదీ కొత్త నిర్వచనాన్ని ఇచ్చారని శ్రీ షా అన్నారు. మోదీ ప్రభుత్వం ప్రతి రంగంలో దీర్ఘకాలిక విధానాలను రూపొందించడమే కాకుండా, వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ క్షేత్ర స్థాయిలో కార్యరూపం దాల్చేటట్లు చూసిందని శ్రీ షా అన్నారు. దేశ భద్రతను బలోపేతం చేయడానికీ, దేశ సంస్కృతిని పరిరక్షించడానికీ, విద్యా విధానాన్ని అమలు పరచడానికీ, స్వయంసమృద్ధి దిశగా పురోగమించడానికీ, ప్రతి రంగంలో విధానాల రూపకల్పనతో పాటు వాటిలో సమయానుసారంగా సంస్కరణలను తీసుకువస్తున్నారని శ్రీ షా అన్నారు.

భారత్‌లో కోట్లాది మంది పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో సమగ్ర ప్రయత్నాలు సాగాయని శ్రీ అమిత్ షా వివరించారు. ప్రస్తుతం దేశంలో బీదలకు ప్రధానమంత్రి శ్రీ మోదీ గారు పంపుతున్న మొత్తం ఎంతయినా సరే, పూర్తిగా వారి చెంతకే చేరుతోందన్నారు. ప్రయోజనాల నేరు బదిలీ (డీబీటీ) పద్ధతిని ప్రవేశపెట్టి నిరుపేదల సంక్షేమంలో ఒక కొత్త యుగాన్ని మోదీ ప్రభుత్వం ఆవిష్కరించిందన్నారు. ఇళ్లు, విద్యుత్తు, నల్లా నీరు, మరుగుదొడ్లు, గ్యాస్ సిలిండర్లు, ఉచితంగా 5 కేజీల ఆహార ధాన్యాలు, ఉచితంగా రూ.5 లక్షల వరకూ వైద్య చికిత్సతో పాటు దేశవ్యాప్తంగా కోట్లాది పేద ప్రజలకు 90 శాతం చౌక మందులను కేవలం 12 సంవత్సరాల్లో నరేంద్ర మోదీ ప్రభుత్వం అందజేసిందన్నారు.

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి స్వేచ్ఛా భారతావనిలో తమకు రావలసినవి పొందడానికి పాట్లు పడవలసివస్తున్న కోట్ల కొద్దీ ప్రజలకు న్యాయంగా వారికి దక్కవలసిన వాటాను నరేంద్ర మోదీ వారికి ఇచ్చిందని కేంద్ర హోం మంత్రి అన్నారు. దేశంలో కోట్ల మందికి తరాల తరబడి ఎడతెగక వస్తున్న సమస్యల్ని ప్రధానమంత్రి శ్రీ మోదీ 12 సంవత్సరాల్లోనే పరిష్కరించారని కూడా శ్రీ షా అన్నారు.

ప్రతి ఒక్కరికీ అందుతున్న పాలన ఫలితాలను ఆరా తీసే ఒక వ్యవస్థను ఈ రోజు ఇక్కడ పక్కాగా ప్రారంభించామని శ్రీ అమిత్ షా అన్నారు. ఇవాళ, బాలలకు పోలియో డోసులు వేయించారు. పోషణ కిట్లను కూడా పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ పూర్తి డేటాబేసును ఏకీకరించి, దానిని జనన మరణ డేటాతో ముడిపెట్టి పీఎమ్ ఫ్యామిలీ కేర్ ట్రాకర్ సాయంతో ప్రతి ఒక్క బిడ్డకూ ఒక ఐడీనీ, ఒక విశిష్ట సంఖ్యనీ సమకూరుస్తారని వెల్లడించారు.

ఈ వేదికతో, ప్రభుత్వ పథకాలన్నింటి ప్రయోజనాల్నీ అందిస్తారన్నారు. పీఎమ్ ఫ్యామిలీ ట్రాకర్ ఒక ఏకీకృత పర్యవేక్షక వ్యవస్థను తీసుకువస్తుందనీ, దాన్లో భాగంగా అవసరమైన వారిని గుర్తించి, వారి విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారనీ శ్రీ షా అన్నారు.

దేశ ఆరోగ్య రంగంలో ఒక పెను మార్పును ప్రధానమంత్రి శ్రీ మోదీ గారు తీసుకు వచ్చారని కేంద్ర హోం మంత్రి అన్నారు. దేశ ఆరోగ్యసంరక్షణ రంగ అవసరాలకు అనుగుణంగా అనేక కార్యక్రమాలను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రవేశపెట్టారనీ, వాటిలో.. వైద్యుల లభ్యత, కోట్లాది పౌరులకు రూ.5 లక్షల వరకూ ఉచిత వైద్య చికిత్స సౌకర్యం, మందులను తక్కువ ధరల్లో అందేటట్లు చూడడం, ఆరోగ్య సంబంధిత మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంతో పాటు ఆయుష్ ద్వారా భారత సాంప్రదాయిక స్వాస్థ్య సంరక్షణ వ్యవస్థల్ని పునరుత్తేజితం చేసినట్లు పేర్కొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి సెరికల్చర్ కరెంటు వినియోగం

ఖమ్మం, జూన్ 30: అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 200 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం లో భారీ స్థాయిలో అక్రమాలు చోటు చేసుకున్నాయి. ఇంటిగ్రేటెడ్ స్కూలు నిర్మాణ పనులు వాస్తవానికి అనధికారికంగా మూడు నెలల క్రితమే ప్రారంభం కాగా ఈనెల 9న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా అధికారికంగా ప్రారంభింపజేశారు. వాస్తవానికి విద్యుత్ శాఖలో నిబంధనల ప్రకారం ఏదేని కాంట్రాక్టర్ తన పనిని ప్రారంభించే సమయంలో తప్పనిసరిగా విద్యుత్ శాఖ నుంచి వచ్చిన మీటర్ను పని ప్రదేశంలో అమర్చిన తర్వాతే అధికారికంగా పనులు ప్రారంభించాలి.

కానీ ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా గడిచిన మూడు నెలల నుండి సెరికల్చర్ విభాగానికి చెందిన త్రీఫేస్ ఒకటి, సింగిల్ ఫేస్ ఒకటి మీటర్లను యదేచ్ఛగా వినియోగిస్తున్నారు. భారీ స్థాయిలో నిర్మాణం అవుతున్న ఈ ప్రాజెక్టులో మూడు నెలల నుండి పూర్తిస్థాయి నీటి వినియోగానికి ,రాడ్ బెండింగ్ కు ఇతరత్రా విద్యుత్ పనులకు పూర్తిస్థాయిలో ఈ మీటర్లను వినియోగిస్తున్నారు అంటే విద్యుత్తును ఏ స్థాయిలో చౌర్యం చేశారో అర్థం చేసుకోవచ్చు. ఈ విధంగా బహిరంగంగా అక్రమంగా వేరే డిపార్ట్మెంట్ కు చెందిన మీటర్లను వినియోగిస్తున్నా సరే విద్యుత్ శాఖ అధికారులు ఎవరూ ఇటువైపు కన్నెత్తి చూడకపోవటంపై సర్వత్ర తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

వాస్తవానికి ఇంటిగ్రేటెడ్ స్కూలు నిర్మాణానికి గాను సెరికల్చర్ కు చెందిన 20 ఎకరాల భూమిని విద్య మరియు సంక్షేమ మౌలిక వసరుల అభివృద్ధి సంస్థకు అప్పగించారు. స్థలాన్ని అప్పగించిన సరే ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఆ శాఖకు చెందిన విద్యుత్ మీటర్లను 200 కోట్ల రూపాయల భారీ ప్రాజెక్టులో వినియోగించడం చట్టరీత్యా నేరం. అయినా దర్జాగా రెండు మీటర్లను మూడు నెలల నుండి వినియోగిస్తున్నారు. సంఘటన స్థలంలో మాత్రం ఒక జనరేటర్ను అమర్చి ఏదో దీని ద్వారానే పనులు మొత్తం నిర్వహిస్తున్నట్లు చెప్పకనే చెబుతున్నారు. ఈ విషయమై విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందగా విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్ ,లైన్ మెన్ లు సంఘటనా స్థలానికి చేరుకుని పని ప్రదేశంలో జరుగుతున్న అక్రమాన్ని గుర్తించారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి గాను కాంట్రాక్టర్ విద్యుత్ శాఖకు మీటర్ కోసం డబ్బులు చెల్లించిన మాట వాస్తవమేనని అది ఇంకా ప్రాసెస్ లోనే ఉన్నదని ప్రాసెస్ లో ఉండగా ఈ విధంగా మీరు విద్యుత్ ని వినియోగించడం నేరమని వారు పేర్కొన్నారు. కొత్త మీటరు వచ్చినదాకా ఆగవలసింది అని మీటర్ వచ్చిన తర్వాత క్షేత్రస్థాయిలో మీటర్ను సెట్ చేసుకుని ట్రాన్స్ఫార్మర్ను తర్వాత అయినా ఏర్పాటు చేసుకోవచ్చు అని వారు పేర్కొన్నారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణంలో జరిగిన విద్యుత్ అక్రమంపై చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొన్నారు. విద్యుత్ శాఖ ఏఈ వివరణ: మీటర్లను వినియోగించడం చట్టరీత్యా నేరమని మీటర్లను డిస్కనెక్ట్ చేసి వినియోగంపై కేసు నమోదు చేస్తామని ఏఈ పేర్కొన్నారు.

# జాతీయ గ్రామీణ అభివృద్ధి సదస్సును ప్రారంభించిన కేంద్రమంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్



న్యూ ఢిల్లీ, జూన్ 30:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సంకల్పించిన 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని క్షేత్రస్థాయిలో ఆచరణాత్మకంగా సాకారం చేసే దిశగా కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల 'రాష్ట్రీయ గ్రామీణ వికాస్ సమ్మేళన్' (జాతీయ గ్రామీణ అభివృద్ధి సదస్సు) ఢిల్లీలో ఘనంగా ప్రారంభమైంది. ఈ సదస్సును కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రులు శ్రీ కమలేష్ పాశ్వాన్, డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉన్నత స్థాయి సదస్సులో భాగంగా మొదటి రోజు వివిధ రాష్ట్రాలకు చెందిన ఉన్నతాధికారులు, నిపుణులు పాల్గొన్నారు. వీరంతా దేశవ్యాప్తంగా అమలవుతున్న వివిధ రకాల గ్రామీణాభివృద్ధి పథకాలపై లోతైన చర్చలు, సంప్రదింపులు జరిపారు. సదస్సులో రెండో రోజైన జూన్ 29న అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రులు సదస్సులో పాల్గొంటారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర వికాసానికి అవసరమైన విధానపరమైన మార్గదర్శకాలను ఖరారు చేయడంతో పాటు, అందరం కలిసికట్టుగా ముందుకు సాగేందుకు ఒక ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికపై చర్చించనున్నారు.

ఈ సదస్సు కేవలం ఒక లాంఛనప్రాయ కార్యక్రమం కాదని, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 'వికసిత్ భారత్' దార్శనికతను సాకారం చేసేలా ఎంతో ఆలోచనాత్మకంగా రూపొందించిన వ్యూహాత్మక ప్రణాళికగా కేంద్ర మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ జాతీయ స్థాయి చర్చా వేదిక ప్రాథమికంగా 'టీమ్ ఇండియా–టీమ్ రూరల్ డెవలప్‌మెంట్'ల సమష్టి ప్రయత్నానికి నిదర్శనమని తెలిపారు. ఈ వేదికపై ఎవరూ ముఖ్య అతిథిగా లేరని, కేంద్రం, రాష్ట్రాల నుంచి వచ్చిన మంత్రులు, అధికారులందరూ ఒక సమష్టి బృందంగా ఇక్కడ ఉన్నారని తెలిపారు. తాను కూడా ఈ బృందంలో ఒక సభ్యుడిని మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. మాజీ ప్రధాన మంత్రి శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి రాసిన కవితా పంక్తులను ఉటంకిస్తూ... మనం ఇతరులను కౌగిలించుకోలేనంత ఎత్తుకు ఎదగకూడదని, ఇదే విధమైన భావన గ్రామీణాభివృద్ధి విధానాల్లో, వాటి అమలులో కూడా ప్రతిబింబించాలని పిలుపునిచ్చారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీని 'సరికొత్త ఆలోచనల స్వరూపం'గా అభివర్ణిస్తూ... అభివృద్ధి చెందిన, సాధికారత కలిగిన, స్వావలంబన, స్వయం సమృద్ధి, వైభవోపేతమైన భారత్‌ను చూడాలనే బలమైన ఆకాంక్ష ప్రధాని గుండెల్లో ఉందని కేంద్ర మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. ఈ రోజు, రేపు ఇక్కడ హాజరైన అధికారులందరూ, రేపు రాబోయే మంత్రులందరూ రాత్రింబవళ్లు ఇదే మంత్రం, సంకల్పంతో శ్రమించినప్పుడే ఈ తపన విజయవంతమైన ఫలితాలుగా మారుతుందని పేర్కొన్నారు. తద్వారా గ్రామాల అభివృద్ధి కథను నేరుగా 'వికసిత్ భారత్' ప్రస్థానంతో అనుసంధానించవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## గ్రామాలే దేశానికి ప్రాణం, ప్రజాస్వామ్యానికి బలమైన పునాది

కేంద్ర మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ తన ప్రసంగంలో గ్రామాల ప్రాముఖ్యతను వివరించారు. గ్రామాలు లేని దేశాన్ని ఊహించలేమని, దేశ జీవనాడి, ఆర్థిక వ్యవస్థ, గుర్తింపు, నాగరికత, సంస్కృతికి గ్రామాలే కేంద్ర బిందువులని ఆయన పేర్కొన్నారు. గ్రామాలను ప్రజాస్వామ్యానికి అత్యంత బలమైన పునాదిగా అభివర్ణించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సు గ్రామీణ శ్రేయస్సు కోసం జరిగే ఒక అమృత మథనం వంటిదని, దీని నుంచి వచ్చే అమృతం రాబోయే సంవత్సరాల్లో దేశంలోని ప్రతి గ్రామానికి చేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అధికారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. కేవలం పథకాలను రూపొందించడం మాత్రమే సరిపోదని, వాటిని క్షేత్ర స్థాయిలో లబ్ధిదారులకు విజయవంతంగా చేరవేయడమే అత్యంత పెద్ద బాధ్యతని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆలోచనలను పంచుకుంటూ.. "ప్రభుత్వం కేవలం ఫైళ్లలో మాత్రమే కాకుండా ప్రజల జీవితాల్లో కనిపించాలి" అని పేర్కొన్నారు. ప్రతి పథకం ప్రయోజనం ఎటువంటి ఇబ్బందులు లేకుండా, లంచాలకు తావులేకుండా, సమయం వృథా కాకుండా అర్హులైన లబ్ధిదారునికి చేరినప్పుడే ఇది సాధ్యమవుతుందని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు.

## సంస్కరణలు, వికసిత్ భారత్– వీబీ–జీ రామ్–జీపై ప్రత్యేక దృష్టి

వివిధ సమావేశాల్లో నిజమైన సంస్కరణలు, లోతైన చర్చలు జరగాలని కేంద్ర మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ పిలుపునిచ్చారు. కేవలం పథకాన్ని రూపొందించడం మాత్రమే సరిపోదని, దానిని లబ్ధిదారులకు సరిగ్గా చేరవేయడం అత్యంత ముఖ్యమని అన్నారు. నిబంధనలు, విధానాలు, అమలు ప్రక్రియలో ఎక్కడైనా అడ్డంకులు ఉంటే, వాటిని నిజాయితీగా గుర్తించి మార్చాలని అధికారులను కోరారు. ఉపాధి హామీ పథకం గురించి శ్రీ శివరాజ్ సింగ్ మాట్లాడుతూ.. తాను ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో జరిగిన ఒక అధ్యయనాన్ని ప్రస్తావించారు. చాలా చోట్ల కూలీలకు బదులుగా యంత్రాలతో పనులు చేయించారని, హాజరు పట్టికలో అక్రమాలు జరిగాయని, తప్పుడు హాజరు నమోదు చేయడం వల్ల నిధులను భారీగా దుర్వినియోగం చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ లోపాలన్నింటినీ సరిదిద్దుతూ మార్పులు చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే కూలీల పనిదినాలను 100 రోజుల నుంచి 125 రోజులకు పెంచామని, అవసరమున్న ఏ ఒక్క కూలీ కూడా పని లేకుండా ఉండిపోకూడదన్నదే తమ సంకల్పమని వెల్లడించారు. వార్షిక బడ్జెట్‌లో కేటాయించే రూ. 1.5 లక్షల కోట్లకు పైగా నిధులు, రాబోయే ఐదేళ్లలో చేయబోయే రూ. 75 లక్షల కోట్ల భారీ పెట్టుబడులు గనుక పంచాయతీలకు సరిగ్గా చేరి, సమర్థవంతంగా వినియోగిస్తే గ్రామాల ప్రాథమిక రూపురేఖలను నిర్ణయాత్మకంగా మార్చవచ్చని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## గ్రామీణాభివృద్ధి సమగ్ర వ్యవస్థే లక్ష్యంగా సదస్సు

ఈ రెండు రోజుల సదస్సు కేవలం ఏదో ఒక పథకానికి మాత్రమే పరిమితం కాలేదని, గ్రామీణాభివృద్ధికి సంబంధించిన సమగ్ర వ్యవస్థపైనే ప్రత్యేకంగా దృష్టి సారించిందని కేంద్ర మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. వికసిత్ భారత్–గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ్) (వీబీ–జీ రామ్–జీ) కింద అభివృద్ధి చెందిన భారత్ కోసం అభివృద్ధి చెందిన గ్రామాలు అనే భావనను పెంపొందించడం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ్) ద్వారా గౌరవమైన గ్రామీణ గృహ నిర్మాణం, ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన ద్వారా పటిష్టమైన రోడ్ల వ్యవస్థ, జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్, గ్రామీణ నైపుణ్యాల ద్వారా జీవనోపాధి, వ్యవస్థాపకతను ప్రోత్సహించడం, జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం ద్వారా సామాజిక భద్రత కల్పించడం వంటి వాటన్నింటినీ ఒకే ఉమ్మడి వ్యవస్థగా అనుసంధానిస్తున్నారు. తద్వారా ప్రధానమంత్రి 'వికసిత్ భారత్' దృక్పథం క్షేత్రస్థాయిలో మరింత వేగం పుంజుకోనుంది.

ప్రస్తుతం పీఎంఏవై–జీ కింద కొనసాగుతున్న భౌతిక ధ్రువీకరణ ప్రచారాన్ని ప్రస్తావిస్తూ.. అధికారులను కేంద్రమంత్రి హెచ్చరించారు. అర్హులైన ఏ ఒక్క లబ్ధిదారులను అనర్హులుగా ప్రకటించడం మహాపాపమని, కేవలం ఎవరిదైనా ఏకపక్ష నిర్ణయాలు లేదా పక్షపాతం కారణంగా ఏ పేద కుటుంబం కూడా ఇల్లు దక్కకుండా నష్టపోకూడదని స్పష్టం చేశారు. దీంతో పాటు రాష్ట్రాల్లో సమష్టి ముడి పదార్థాల కొనుగోలు, మేస్త్రీలకు శిక్షణ, వివిధ పథకాల అనుసంధానం వంటి వినూత్న పద్ధతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

## లఖ్‌పతి దీదీలు, గ్రామీణ పారిశ్రామికవేత్తలు, మహిళా శక్తి

జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ కింద మహిళలు పోషిస్తున్నపాత్రను కేంద్ర మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రత్యేకంగా కొనియాడారు. ఇప్పటి వరకు కోట్లాది మంది సోదరీలు స్వయం సహాయక బృందాలలో చేరి తమ ఆదాయాన్ని పెంచుకున్నారని, తద్వారా లక్షలాది మంది లఖ్‌పతి దీదీలు ఆవిర్భవించారని అన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో ఈ సంఖ్యను 6 కోట్లకు చేర్చడమే లక్ష్యమని, ఇందుకోసం సోదరీలను ఇప్పుడు కేవలం సంఘాల స్థాయిలో మాత్రమే కాకుండా, వ్యక్తిగత స్థాయిలో కూడా ఆధునిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని తెలిపారు. కేవలం అప్పడాలు, పచ్చళ్ల తయారీకే పరిమితం కాకుండా, గ్రామీణ సోదరీలను ఆహార శుద్ధి, వ్యవసాయ ఆధారిత వ్యాపారం, సేవా రంగం, డిజిటల్ వేదికల వైపు ముందుకు తీసుకెళ్లాలని, అప్పుడే గ్రామీణ పారిశ్రామికవేత్తలుగా మారి నిజంగా 'వికసిత్ భారత్'కు వెన్నెముకగా మారగలరని అన్నారు.

## ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన, ఎన్ఎస్ఏపీ: రవాణా సౌకర్యం, సామాజిక భద్రత

మాజీ ప్రధానమంత్రి శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రారంభించిన 'ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన' గ్రామీణ భారత్ రూపురేఖలను మార్చిన ఒక చారిత్రాత్మక కార్యక్రమమని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ అభివర్ణించారు. సరైన రహదారులు లేక వెనుకబడిన గ్రామాలను దేశ ప్రధాన స్రవంతిలోకి అనుసంధానించే ప్రక్రియ ప్రస్తుతం అత్యంత వేగంగా సాగుతోందని చెప్పారు. మెరుగైన రవాణా వ్యవస్థ అందుబాటులోకి రావడం వల్ల గ్రామాలకు విద్యా, వైద్య, మార్కెట్ సౌకర్యాలు చేరువ వుతున్నాయని, రైతులు సైతం తమ పంటలకు మంచి ధరలు పొందగలుగుతున్నారని పేర్కొన్నారు. జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం కింద అందించే వృద్ధాప్య పింఛన్లు, వితంతు పింఛన్లు, దివ్యాంగుల పింఛన్ల వంటి పథకాల పురోగతిని సమీక్షించడం కూడా ఈ రెండు రోజుల సదస్సు అజెండాలో కీలక భాగమని ఆయన తెలిపారు. డిజిటల్ వేదికల ద్వారా పింఛన్ల పంపిణీలో పారదర్శకతను, సమయపాలనను పాటించాలని పేర్కొన్నారు. సమగ్ర భారత్ నిర్మాణంలో సామాజిక భద్రతను బలోపేతం చేయడం అవసరమని అన్నారు.

## జట్టు స్ఫూర్తి, కార్యాచరణ విధానం

ప్రభుత్వ ఉద్యోగాన్ని కేవలం ఒక జీవనోపాధిగా కాకుండా, దేశ సేవ కోసం ఒక పవిత్రమైన లక్ష్య సాధనగా భావించాలని రేపు సమావేశానికి హాజరుకానున్న అధికారులకు, మంత్రులకు కేంద్ర మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ పిలుపునిచ్చారు. మన దృక్పథం మారితే మనం చేసే పనిలో ఉండే శక్తి కూడా మారుతుందని, గ్రామీణ భారత్ రూపురేఖలను మార్చే గొప్ప అదృష్టంగా మన పనిని భావిస్తే.. ప్రతి సమావేశం, ప్రతి కార్యక్రమం, ఈ రెండు రోజుల సదస్సు ఒక 'అమృత మథనం'గా మారగలదని అన్నారు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు వివరించిన సాత్విక కార్యకర్త లక్షణాలైన బంధాలకు అతీతంగా ఉండటం, అహంకారం లేకపోవడం, ఓర్పు, ఉత్సాహాన్ని కలిగి ఉండటం వంటి వాటిని కేంద్రమంత్రి ప్రస్తావించారు. ఒక్క వ్యక్తి ఒక గ్రామాన్ని మార్చగలరని, ఒక్క అధికారి మొత్తం జిల్లాను మార్చగలరని, ఒక్క నాయకుడు దేశాన్నే మార్చగలరని, నేడు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆ విధంగా దేశాన్ని మార్చే పనిలో ఉన్నారని తెలిపారు. రాష్ట్రాలన్నీ తమ పరిధిలో గ్రామీణాభివృద్ధిని లక్ష్య సాధనగా భావించి, ఈ సదస్సు నుంచి వచ్చే 'అమృతాన్ని' తమ రాష్ట్రాలకు తీసుకెళ్లి, గ్రామ గ్రామానికి చేర్చాలని కోరారు.

ప్రారంభోత్సవ రోజు పథకాల అమలు, పురోగతి సమీక్ష, సంస్కరణల సూచనలపైనే ప్రధానంగా దృష్టి సారించారు. వికసిత్ భారత్–గ్రామ్ (వీబీజీ రామ్ –జీ) ప్రధానమంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ్), జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్, గ్రామీణ నైపుణ్యాలు, ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన, జాతీయ సామాజిక సహాయ కార్యక్రమాలపై వివిధ హాళ్లలో సుదీర్ఘ చర్చా సమావేశాలు నిర్వహించారు. పథకాల సమగ్ర పరిశీలన, రాష్ట్రాల వారీగా పురోగతి సమీక్ష, ఉత్తమ పద్ధతుల ప్రదర్శన, సాంకేతిక, కృత్రిమ మేధ వినియోగం, ఆర్థిక నిర్వహణపై అధికారులు లోతైన చర్చలు జరిపారు. రెండో రోజు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రులు ఈ ప్లీనరీ సమావేశాల్లో పాల్గొనడం ద్వారా రాజకీయ నాయకత్వం అధికారికంగా ఈ చర్చల్లో భాగస్వామ్యం కానుంది.

నగరాల్లో పెరుగుతున్న వలసలను, జనాభా ఒత్తిడిని నియంత్రించాలంటే గ్రామీణ సమాజాలను బలోపేతం చేయడం, స్థిరమైన జీవనోపాధిని పెంపొందించడం అత్యంత ఆవశ్యకమని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి శ్రీ చంద్రశేఖర్ పెమ్మసాని చెప్పారు. ఉపాధి హామీ పథకం నుంచి వీబీజీ రామ్ –జీగా మారడాన్ని ఆయన ప్రస్తావిస్తూ.. ఇది కేవలం తాత్కాలిక ఉపాధి కల్పన మాత్రమే కాకుండా, ఆస్తులు, సంపద సృష్టిగా మారుతుందని వివరించారు.

# ఉత్తర అమెరికా సమ్మర్ ఫ్యాన్సీ ఫుడ్ షో... ఇండియా పెవిలియన్ ప్రారంభం

న్యూఢిల్లీ, జూన్ 30:ఉత్తర అమెరికాలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే సమ్మర్ ఫ్యాన్సీ ఫుడ్?2026లో భారత్ పాలుపంచుకుంటున్నది. ఈ ప్రత్యేక ఆహార ప్రదర్శనలో భారత్ ఇంత పెద్ద ఎత్తున పాల్గొనడం ఇదే తొలిసారి. న్యూయార్క్‌లోని జాకబ్ కే జావిట్స్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను- భారత కాన్సుల్ జనరల్ బినాయా శ్రీకాంత ప్రధాన్, షెఫ్, రచయిత, టైమ్ 100 జాబితాలో చోటు దక్కించుకున్న వికాస్ ఖన్నా 2026 జూన్ 28న ప్రారంభించారు. ఈ ఆహార ప్రదర్శనను వందలాది భారతీయ ఆహార బ్రాండ్‌లు, ఎగుమతిదారులు, ఆవిష్కర్తలను ఒకే వేదికపైకి తీసుకువచ్చింది.

భారత ప్రభుత్వ వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో వ్యవసాయం, శుద్ధి చేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధి సంస్థ (ఏపీఈడీఏ), భారత వాణిజ్య ప్రోత్సాహక సంస్థ (ఐటీపీవో) సంయుక్తంగా ఇండియా విభాగాన్ని ఏర్పాటు చేశాయి. ఇది భారతీయ ఆహార ఉత్పత్తులకు అంతర్జాతీయంగా పెరుగుతున్న ఆదరణను సూచిస్తోంది. అదేవిధంగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న కొనుగోలుదారులకూ, చిల్లర వర్తకులకూ, పంపిణీదారులకూ భారత దేశ వ్యవసాయ, ఆహార శుద్ధి పరిశ్రమ గొప్పతనాన్నీ, వైవిధ్యాన్నీ, నాణ్యతనూ తెలియజేస్తోంది.

సమ్మర్ ఫ్యాన్సీ ఫుడ్ షోలో భారతదేశం నుంచి బాస్మతీ బియ్యం, మసాలా దినుసులు, రెడీ టు ఈట్ ఆహారాలు, పానీయాలు, సేంద్రీయ ఉత్పత్తులు, శీతలీకరించిన ఆహారం, తినుబండారాలు, విలువ ఆధారిత వ్యవసాయ ఉత్పత్తులతో సహా విభిన్న రంగాలకు చెందిన ఎగుమతిదారులు పాల్గొన్నారు. ఇది ప్రపంచంలోనే ఆహారం ఎగుమతుల్లో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న దేశాల్లో ఒకటిగా భారత్ స్థానాన్ని బలోపేతం చేస్తోంది.

ఈ పెవిలియన్‌లో ఏర్పాటు చేసిన ఇండియన్ మ్యాంగో షోకేస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీనిలో ఆరు ప్రీమియం ఎగుమతి రకాలను, మామిడితో తయారు చేసిన వినూత్న ఆహార వంటకాలను ప్రదర్శిస్తున్నారు. ఈ ప్రదర్శన భారత్‌లో పండే మామిడి పండ్ల వైవిధ్యాన్ని వివరిస్తోంది. ప్రపంచంలోనే ఈ పండ్లను అత్యధికంగా పండించే దేశంగా భారత్ స్థానాన్ని తెలియజేస్తోంది.

ఇక్కడ ఏర్పాటు చేసిన బాస్మతి వంటలను సందర్శకులు రుచి చూపిస్తున్నారు. నాణ్యమైన బాస్మతితో రూపొందించిన విదేశీ వంటకాలు కూడా ఆకట్టుకుంటున్నాయి. సందర్శకుల కోసం ఎంపిక చేసిన భారతీయ వంటకాలను ప్రముఖ మిషెలిన్ స్టార్ షెఫ్ హేమంత్ మాథుర్ తయారు చేస్తున్నారు.

భారత్‌లో పండే బాస్మతీకి ఉన్న ప్రత్యేకమైన సువాసన, మృదుత్వం, నాణ్యత వల్ల అంతర్జాతీయ మార్కెట్లలో డిమాండ్ పెరుగుతోంది. భారతీయ ఆహారానికి ప్రపంచవ్యాప్తంగా గిరాకీ పెరుగుతున్న నేపథ్యంలో? వ్యవసాయ క్షేత్రాలు, కర్మాగారాల నుంచి డైనింగ్ టేబుల్ వరకు సాగిన ఈ ప్రయాణానికి ఇండియా పెవిలియన్ ఒక శక్తిమంతమైన చిహ్నంగా నిలుస్తుంది. ఇది వ్యవసాయం, ఆహార రంగాల్లో మిలియన్ల మంది చేసిన సమష్టి ప్రయత్నాలతో సాధ్యమైంది.

సమ్మర్ ఫ్యాన్సీ ఫుడ్?2026లో గతంలో ఎన్నడూ లేనంత విస్తృత స్థాయిలో ఇండియా పెవిలియన్ ప్రారంభం కావడం పట్ల ఐటీపీవో మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నీరజ్ కర్వాల్ హర్షం వ్యక్తం చేశారు. ఐటీపీవో, అపెడా మధ్య ఉన్న సహకారం.. భారతీయ ఆహార ఎగుమతులకు పెద్ద ఎత్తున ప్రయోజనం చేకూరుస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో న్యూయార్క్‌లోని భారత కాన్సుల్ జనరల్ బినాయా శ్రీకాంత ప్రధాన్ ప్రసంగించారు. అమెరికాలో భారతీయ ఆహార ఉత్పత్తులను, బ్రాండ్లను బలోపేతం చేసే కార్యక్రమంగా ఈ పెవిలియన్ నిలుస్తుందని ఆయన చెప్పారు. అమెరికా మార్కెట్లో విస్తరణకు ప్రయత్నిస్తున్న భారతీయ బ్రాండ్లకు సమ్మర్ ఫ్యాన్సీ ఫుడ్ షోలో ఏర్పాటు చేసిన ఇండియా పెవిలియన్ ప్రామాణిక కార్యక్రమంగా నిలుస్తుందని చెప్పారు. అలాగే భారతీయ ఆహార పరిశ్రమ నమ్మకాన్నీ, సామర్థ్యాన్నీ, నాణ్యతనూ ప్రతిబింబిస్తుందని తెలిపారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో షెఫ్ వికాస్ ఖన్నా పాల్గొనడం గొప్ప విషయమన్నారు. దాదాపు మూడు దశాబ్దాలుగా ఆహారమనే సార్వత్రిక భాష ద్వారా భారత దేశ సంస్కృతినీ, సంప్రదాయాలనూ, విలువలనూ పాశ్చాత్య దేశాలకు తీసుకువెళుతున్న గొప్ప రాయబారుల్లో ఆయన ఒకరని తెలిపారు.

భారతీయ ఆహార ఎగుమతులకు సంబంధించి కీలకమైన సమయంలో ఈ ప్రారంభోత్సవం జరిగింది. వాణిజ్య అంచనాల ప్రకారం, వచ్చే దశాబ్ద కాలంలో భారతీయ ప్యాకేజ్డ్ ఆహార ఉత్పత్తులకు సుమారు 30 నుంచి 50 బిలియన్ డాలర్ల విలువైన అవకాశాన్ని ఉత్తర అమెరికా మార్కెట్ అందిస్తుందని భావిస్తున్నారు. ఈ వృద్ధికి ప్రామాణికమైన భారతీయ రుచులు, నాణ్యమైన పదార్థాలు, విశ్వసనీయమైన ఆహార బ్రాండ్‌లకు వినియోగదారుల నుంచి పెరుగుతున్న గిరాకీ దోహదపడుతున్నాయి.

ప్రారంభ కార్యక్రమంలో షెఫ్ వికాస్ ఖన్నా మాట్లాడుతూ.. ఇక్కడ ప్రదర్శించిన ప్రతి ఉత్పత్తి ఆహార రంగంలో పనిచేస్తున్న లక్షలాది మంది భారతీయుల ఆకాంక్షలకూ, జీవనాధారానికీ ప్రతీక అని అన్నారు. ఈ పరిశ్రమ కేవలం ఉత్పత్తుల గురించి మాత్రమే కాదనీ, ప్రతి ధాన్యమూ, మసాలా దినుసూ, ప్యాకేజీ వెనుక ఉన్న లక్షలాది మంది రైతులు, వ్యాపారులు, తయారీదారులు, ఫ్యాక్టరీ కార్మికులు, ఎగుమతిదారులు, పంపిణీదారులు, రిటైల్ వ్యాపారుల గురించి కూడా అని ఆయన వివరించారు. భారతీయ ఆహారానికి లభించే ప్రతి అవకాశమూ.. ఈ సరఫరా రంగంలో అనేక కుటుంబాలకు అవకాశాలను కల్పిస్తుందన్నారు. ఈ విజయం.. ఈ ఉత్పత్తుల వెనక ఉన్న ప్రతి రైతుకూ, వ్యాపారికీ, తయారుదారునికీ, కార్మికునికీ చెందుతుందని తెలియజేశారు. అంతర్జాతీయ స్థాయి కొనుగోలుదారులను ఇండియా పెవిలియన్‌కు అపెడా ఛైర్మన్ అభిషేక్ దేవ్ ఆహ్వానించారు. ఈ ప్రదర్శనలో భారత్ రికార్డు స్థాయిలో పాల్గొనడానికి ఉన్న ప్రాధాన్యాన్నీ, ప్రపంచ ఆహార ఎగుమతుల్లో పెరుగుతున్న దేశ ప్రాభవాన్నీ వివరించారు. అంతర్జాతీయ మార్కెట్లలో తమ నాణ్యతనూ, ఆవిష్కరణనూ, వైవిధ్యాన్నీ ప్రదర్శించేందుకు అవసరమైన వేదికను భారతీయ ఆహార సంస్థలకు సమ్మర్ ఫ్యాన్సీ ఫుడ్ షో అందిస్తుంది. ఈ కార్యక్రమంలో 70 మందికి పైగా భారతీయ ఎగ్జిబిటర్లు పాల్గొన్నారనీ, వారి భాగస్వామ్యం భారతీయ ఎగుమతుదారుల నమ్మకానికి నిదర్శనంగా నిలుస్తుందనీ, భారతదేశ ఉత్పత్తులపై అంతర్జాతీయ మార్కెట్లలోని వినియోగదారుల్లో పెరుగుతున్న విశ్వసనీయతను ప్రతిబింబిస్తుందనీ ఆయన అన్నారు.

## విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ..

నిజామాబాద్, జూన్ 30:భీంగల్ మండలంలోని గోన్ గొప్పుల గ్రామ ప్రీ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ స్వామి హాజరుకాగా, గ్రామ సర్పంచ్ సేపూర్ చరణ్ గౌడ్ విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు.

ఈ సందర్భంగా సర్పంచ్ చరణ్ గౌడ్ మాట్లాడుతూ, విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఉచిత విద్యను ప్రోత్స హిస్తూ విద్యార్థుల భవిష్యత్తు కోసం అనేక సంక్షేమ కార్యక్రమా లను అమలు చేస్తోందని తెలిపారు.

ప్రభుత్వ పథకాలను సద్విని యోగం చేసుకుని విద్యార్థులు విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. ఎంఈఓ స్వామి మాట్లాడుతూ, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

విద్యార్థు లు క్రమం తప్పకుండా పాఠశా లకు హాజరై, అందించిన పుస్తకా లను సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు.

# సీజ్ చేసిన 227.18 కేజీల గంజాయి నిర్వీర్యం

-జిల్లా ఎస్పి కె.నరసింహ




నల్గొండ, జూన్ 30:29 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 227.18 కేజీ గంజాయినీ ప్రభుత్వ, కోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ అధ్వర్యంలో మంగళవారం యాదాద్రి జిల్లా తుక్కాపుర్ గ్రామం లోగల రోమా ఇండస్ట్రీస్ యాజమాన్యం, సిబ్బంది సహాయంతో ప్రభుత్వ సాక్షుల సమక్షంలో గంజాయిని నిర్వీర్యం చేసి బూడిద చేయడం జరిగిందని డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్ ఎస్పి నరసింహ తెలిపారు. పర్యావరణానికి, ప్రజా జీవనానికి ఎలాంటి హానీ కలగకుండా జాగ్రత్తలు తీసుకుని నిర్వీర్యం చేయడం జరిగిందన్నారు. దీని విలువ 1 కోటి పైనే ఉంటుందని వెల్లడించారు. డ్రగ్స్ నివారణ అందరి సామాజిక బాధ్యత. డ్రగ్స్, గంజాయి వినియోగించడం వల్ల యువత భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు.

డ్రగ్స్ రవాణా, వినియోగం నేరమన్నారు. గంజాయి నివారణ లో జిల్లా పోలీసు కృషి చేస్తుంది అన్నారు. డ్రగ్స్ అమ్మకం, రవాణా, వినియోగం కు సంభందించి పోలీసులకు, డయల్ 100, 112, 1908 కు సమాచారం ఇవ్వాలన్నారు. డగ్స్, గంజాయి వియోగించే వారిని, వ్యాపారం చేసే వారిని గుర్తించి కౌన్సిలింగ్ ఇస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల అలవాట్లను గమనిస్తూ చెడు వ్యసనాలకు లోనవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ సభ్యులు డిఎస్పిలు ప్రసన్న కుమార్, శ్రీనివాస్ రెడ్డి, రవి, నరసింహ, ఎస్ఐ లు యాకూబ్, జాన్సీరాణి, సిబ్బంది ఉన్నారు.

# సీఫుడ్ ఎక్స్‌పో భారత్ 2026'లో ఎంపెడా ఆధ్వర్యంలో రెండవ జాతీయ సీఫుడ్ స్కిల్ ఒలింపియాడ్ నిర్వహణ

న్యూఢిల్లీ, జూన్ 30:సీఫుడ్ ఎక్స్‌పో భారత్ 2026'లో ఎంపెడా ఆధ్వర్యంలో రెండవ జాతీయ సీఫుడ్ స్కిల్ ఒలింపియాడ్ నిర్వహణభారత సముద్ర ఆహార ఉత్పత్తుల ప్రదర్శన (సీఫుడ్ ఎక్స్‌పో భారత్ - 2026)లో భాగంగా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధి సంస్థ (మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ - ఎంపెడా) జూలై 1 నుంచి 3 వరకు రెండో జాతీయ సీఫుడ్ స్కిల్ ఒలింపియాడ్‌ను నిర్వహిం చనుంది. విలువ ఆధారిత సముద్ర ఆహార ఉత్పత్తుల తయారీలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి దేశవ్యాప్తంగా నిపుణులైన సీఫుడ్ ప్రాసెసింగ్ నిపుణులను ఈ ఒలింపియాడ్ ఒకే వేదికపైకి తీసుకురానుంది.

భారత సముద్ర ఆహార ఉత్పత్తుల శుద్ధి రంగంలో ఆవిష్కరణలను ప్రోత్సహించడం, నాణ్యత ప్రమాణాలను పెంచడం, పరిశ్రమలోని ప్రతిభావంతులను గుర్తించడం, నిపుణులైన శ్రామిక శక్తి అభివృద్ధిని బలోపేతం చేయడం ఈ పోటీ ముఖ్య ఉద్దేశం. సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో మరింత విలువ ఆధారిత ప్రక్రియలను ప్రోత్సహించడం కూడా ఈ పోటీ లక్ష్యంగా పెట్టుకుంది.

రెండో విడత స్కిల్ ఒలింపియాడ్‌కు సన్నాహకంగా, ఎంపెడా దేశవ్యాప్తంగా 50 సముద్ర ఆహార విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణా కార్యక్రమాలతో కూడిన విస్తృత సామర్థ్య పెంపుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. అంతర్జాతీయ మార్కెట్లలో మంచి డిమాండ్ ఉన్న విలువ ఆధారిత సముద్ర ఉత్పత్తుల తయారీలో 2,500 మందికి పైగా ప్రాసెసింగ్ కార్మికులకు, నిపుణులకు ఈ సందర్భంగా శిక్షణ ఇచ్చారు.

ఈ శిక్షణలో బ్రెడెడ్ స్క్విడ్ రింగ్స్, నోబాషి (సాగదీసిన రొయ్యలు), బ్రెడెడ్ బటర్‌ఫ్లై రొయ్యలు, ఉడికించిన పీల్డ్, డివైన్డ్, టైల్-ఆన్ రొయ్యలు, మెరినేటెడ్ రొయ్యల స్క్యూయర్స్ (కడ్డీలకు గుచ్చిన రొయ్యలు), ఫిష్ ఫిల్లెట్స్ (చేప ముక్కలు) వంటి ఉత్పత్తుల తయారీపై అవగాహన కల్పించారు. ప్రతి శిక్షణా కార్యక్రమం ముగిసిన తర్వాత ప్రాథమిక స్థాయి నైపుణ్య పోటీలను నిర్వహించి, వాటిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని తుది పోటీలకు ఎంపిక చేశారు.

ఆ తర్వాత ఈ పోటీలను తీరప్రాంత రాష్ట్రాల్లో రాష్ట్ర స్థాయి స్కిల్ ఒలింపియాడ్‌లుగా నిర్వహించారు. అనంతరం పశ్చిమ తీర ప్రాంతం కోసం ముంబైలో, తూర్పు తీర ప్రాంతం కోసం విజయవాడలో ప్రాంతీయ స్కిల్ ఒలింపియాడ్‌లను నిర్వహించారు. ఈ ప్రాంతీయ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన టాప్ 10 మంది విజేతలు జాతీయ సీఫుడ్ స్కిల్ ఒలింపియాడ్ గ్రాండ్ ఫినాలేకు అర్హత సాధించారు.

గ్రాండ్ ఫినాలేలో విజేతలు, సీఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ, విద్యా రంగానికి చెందిన ప్రముఖ నిపుణులతో కూడిన జ్యూరీ సమక్షంలో తమ సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శించనున్నారు. విజేతలకు పతకాలు, ధృవపత్రాలతో పాటు నగదు బహుమతులను కూడా అందచేస్తారు. ప్రథమ బహుమతి కింద రూ. 1,00,000, ద్వితీయ బహుమతిగా రూ. 75,000, తృతీయ బహుమతిగా రూ. 50,000, నాల్గవ బహుమతి (కన్సోలేషన్) కింద రూ. 25,000 నగదును ప్రదానం చేస్తారు.

ఈ కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సీనియర్ అధికారులు, సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతిదారులు, అంతర్జాతీయ కొనుగోలు దారులు, పరిశ్రమల ప్రముఖులు, సాంకేతిక నిపుణులు, సీఫుడ్ ఎక్స్‌పో భారత్ 2026లో పాల్గొనే ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు.

తుది పోటీల్లో అవార్డులు పొందిన విలువ ఆధారిత సముద్ర ఆహార ఉత్పత్తులను స్కిల్ ఒలింపియాడ్ పెవిలియన్లో ప్రదర్శిస్తారు. ఎంపెడా శిక్షణ కార్యక్రమాల ద్వారా అభివృద్ధి చేసిన ఎగుమతి ఆధారిత విలువ ఆధారిత సముద్ర ఆహార ఉత్పత్తుల ప్రత్యక్ష ప్రదర్శనలు, రుచి చూసే సెషన్లు కూడా ఈ పెవిలియన్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

సముద్ర ఆహార విలువ శ్రేణి అంతటా నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఎంపెడా కట్టుబడి ఉందనడానికి నేషనల్ సీఫుడ్ స్కిల్ ఒలింపియాడ్ నిదర్శనమని ఎంపెడా ఛైర్మన్ శ్రీ పి. జవహర్ తెలిపారు.

నైపుణ్యం కలిగిన వారిని గుర్తించి, ప్రోత్సహించడం ద్వారా ఈ చొరవ పరిశ్రమలోని శ్రామిక శక్తిని బలోపేతం చేస్తుందని, అంతర్జాతీయంగా నాణ్యమైన సీఫుడ్‌ను సరఫరా చేసే విశ్వసనీయ దేశంగా భారత స్థానాన్ని మరింత మెరుగు పరుస్తుందని ఆయన పేర్కొన్నారు.

సముద్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థలో భారత్ నాయకత్వాన్ని నిలబెట్టుకోవడానికి మానవ వనరులపై పెట్టుబడి పెట్టడం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ మార్కెట్ల మారుతున్న అవసరాలకు అనుగుణంగా, అత్యంత నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని తయారు చేయడంలో ఈ చొరవ ఎంతగానో దోహదపడుతుందని ఆయన వివరించారు.

భారత ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ సముద్ర ఆహార ప్రదర్శన - 2026లో సీఫుడ్ ప్రాసెసింగ్, ఆక్వాకల్చర్, ప్యాకేజింగ్ యంత్రాలు, రవాణా, ప్రభుత్వ పెవిలియన్ల వంటి ప్రత్యేక విభాగాలలో 325కు పైగా స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు.

మూడు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనలో దాదాపు 5,000 మంది స్వదేశీ, అంతర్జాతీయ భాగస్వాములు పాల్గొననున్నారు. వీరంతా ఉన్నత స్థాయి బిజినెస్-టు-బిజినెస్ సమావేశాలలో పాల్గొనడంతో పాటు, రిటైల్, ఆక్వాకల్చర్ విలువ శ్రేణుల్లోని ఇతర భాగస్వాములతో చర్చలు జరపనున్నారు. ఆవిష్కరణలు, సుస్థిరత, పరిశ్రమలో వస్తున్న సరికొత్త పోకడలపై దృష్టి సారించే ఐదు సాంకేతిక సెషన్లకు కూడా వీరు హాజరుకానున్నారు.

ఈ ప్రదర్శనలో నేషనల్ సీఫుడ్ స్కిల్ ఒలింపియాడ్, సముద్ర ఆహార వంటకాల తయారీ ఒలింపియాడ్ వంటి ప్రధాన నైపుణ్య, పాకశాస్త్ర పోటీలను కూడా నిర్వహించనున్నారు.

తద్వారా అంతర్జాతీయ సీఫుడ్ విలువ శ్రేణి అంతటా వ్యాపార అవకాశాలను విస్తరించుకోవడానికి, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, వ్యూహాత్మక భాగస్వామ్యాలను పెంపొందించుకోవడానికి పరిశ్రమలోని భాగస్వాములందరికీ ఇది ఒక సమగ్రమైన వేదికను అందించనుంది.

2025-26 ఆర్థిక సంవత్సరంలో భారత సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతులు రికార్డు స్థాయిలో 8.45 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. దీనితో ప్రపంచంలోనే అగ్రగామి సీఫుడ్ ఎగుమతి దేశాలలో ఒకటిగా భారత్ స్థానానికి మరింత గుర్తింపు లభించింది. ప్రస్తుతం దేశంలో 670 అధికార సీఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఉండగా, వీటి మొత్తం ప్రాసెసింగ్ సామర్థ్యం రోజుకు 40,000 మెట్రిక్ టన్నులకు పైగా ఉంది. వీటిలో 127 యూనిట్లు విలువ ఆధారిత సీఫుడ్ ఉత్పత్తులను తయారు చేస్తున్నాయి.

ఇవి భారత మొత్తం సీఫుడ్ ఎగుమతుల్లో దాదాపు 10 శాతం (0.84 బిలియన్ డాలర్లు) వాటాను అందిస్తున్నాయి.

విలువ ఆధారిత సముద్ర ఆహార రంగానికి ఉన్న అపారమైన వృద్ధి అవకాశాలను గుర్తించిన భారత్ 2030 నాటికి మొత్తం సీఫుడ్ ఎగుమతుల్లో ఈ విలువ ఆధారిత ఉత్పత్తుల వాటాను 25 శాతానికి పెంచాలని బృహత్తర లక్ష్యాన్ని నిర్దేశించుకుంది.

ఈ లక్ష్యాన్ని సాధించడానికి ఉత్పత్తులలో సరికొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడం, ప్రాసెసింగ్, విలువ ఆధారిత మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని అభివృద్ధి చేయడం, సీఫుడ్ ప్రాసెసింగ్ రంగమంతటా నాణ్యతా ప్రమాణాలపై అవగాహనను పెంచడం వంటి అంశాలపై వివిధ రకాల పథకాలనూ, సామర్థ్య పెంపుదల కార్యక్రమాలనూ ఎంపెడా అమలు చేస్తోంది.

## తిరుమలగిరి జడ్పీ పాఠశాలకు 150 అడ్మిషన్లు

మహబూబ్‌నగర్, జూన్ 30:సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 2026?27 విద్యా సంవత్సరానికి ఇప్పటికే 150 మంది విద్యార్థులు అడ్మిషన్ తీసుకున్నారు. వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయులు బృందాలుగా ఏర్పడి 'బడిబాట' కార్యక్రమం నిర్వహిస్తూ ఇంటిం టికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్యపై అవగాహన కల్పించడంతో ఈ ఫలితం సాధ్యమైందని పాఠశాల యాజమాన్యం తెలిపింది. 150 మంది విద్యార్థులు చేరిన సందర్భంగా వారితో '150' ఆకారాన్ని రూపొందించి పాఠశాలలో పండుగ వాతావరణంలో సంబరాలు నిర్వహించారు. జిల్లాలో అత్యధిక అడ్మిషన్లు నమోదు చేసిన ప్రభుత్వ పాఠశాలగా తిరుమలగిరి జడ్పీ ఉన్నత పాఠశాల నిలిచిందని ప్రధానోపాధ్యాయులు దామెర శ్రీనివాస్ తెలిపారు. త్వరలోనే 200కు పైగా అడ్మిషన్లు సాధించడం లక్ష్యంగా పనిచేస్తున్నామని, భవిష్యత్తులో పాఠశాలలో 500 మంది విద్యార్థులతో ప్రార్థన నిర్వహించే స్థాయికి తీసుకెళ్లేందుకు ఉపాధ్యాయులందరూ సమిష్టిగా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఘనంగా వెంకటేశ్వరుడి కళ్యాణ మహోత్సవ వేడుకలు..



నల్గొండ, జూన్ 30:యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీమత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన వెంకటాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 8 గంటలకు అంకురార్పణ, హోమం నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు ధ్వజారోహణం (గరుడ ముద్ర) వైదిక సంప్రదాయాల ప్రకారం నిర్వహించారు.

వైభవంగా శ్రీ స్వామివారి కళ్యాణ మహోత్సవం

సోమవారం రాత్రి శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి కళ్యాణ మహోత్సవం వేద పండితుల మంత్రోచ్చారణలు, సన్నాయి మేళాల నడుమ అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి దివ్య కళ్యాణాన్ని తిలకించారు.

కళ్యాణోత్సవానికి ముందు ఆలయ కార్యనిర్వహణాధికారి కొత్తపెల్లి వెంకటయ్య పట్టు వస్త్రాలు, తలంబ్రాలను కళ్యాణ మండపానికి తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. అనంతరం మహా ప్రసాదంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కొత్తపెల్లి వెంకటయ్య, గ్రామ సర్పంచ్ కర్ణకంటి కలమ్మ?యాదయ్య, మత్స్యగిరి గుట్ట మాజీ చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీశైలం, వివిధ గ్రామాల సర్పంచులు, ధర్మకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు


# డీఎఫ్‌పీ-2026 ద్వారా ఆత్మనిర్భర్ భారత్ సంకల్పానికి మరింత ఊతం.. రక్షణ సన్నద్ధత బలోపేతం: ఆర్ఎం



న్యూఢిల్లీ, జూన్ 30:వ్యూహాత్మక ఆర్ అండ్ డీ ప్రాజెక్టుల సామర్థ్యాన్ని, జవాబుదారీతనాన్ని పెంచేందుకు, సకాలంలో ప్రాజెక్టులను పూర?తి చేసేందుకు కీలక సంస్కరణ మార్గదర్శకాలు- డీఆర్‌డీఓకు ఆర్థిక అధికారాలు (డీఎఫ్‌పీ-2026)- జూన్ 29, 2026న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విడుదల చేశారు. ఆర్ అండ్ డీ వ్యవస్థలో పుట్టుకొస్తున్న నూతన వ్యవస్థలు, వేదికలు, సాంకేతికతలను వేగంగా అభివృద్ధి చేసి, ప్రవేశపెట్టడాన్ని డీఎఫ్‌పీ-2026 సులభతరం చేస్తుందని రక్షణ మంత్రి తెలిపారు. సవరించిన విధానం పరిశ్రమలు, విద్యాసంస్థలతో బలమైన సహకారాన్ని పెంపొందిస్తుందని, ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతను మరింత బలోపేతం చేస్తుందని చెప్పారు. ఈ నూతన వ్యవస్థ రక్షణ సాంకేతికతల్లో స్వావలంబనను పెంపొందించేందుకు, దేశ రక్షణ సన్నద్ధతను మరింత బలోపేతం చేసేందుకు దోహదపడుతుందని వివరించారు.

రక్షణ ఆర్ అండ్ డీ విభాగంలో వివిధ స్థాయిల్లో కార్యాచరణ సాధికారతను పెంపొందించటవే డీఎఫ్‌పీ-2026 లక్ష్యం. సవరించిన వ్యవస్థ పలు కీలక అవసరాలను తీరుస్తుంది. ఇందులో ప్రయోగాత్మక ప్రచార కార్యక్రమాలు, పరీక్షలు, మూల్యాంకన కార్యకలాపాల కోసం ప్రత్యేక ఆర్థిక కేటాయింపులు, ప్రాజెక్టుకు ముందస్తుగా పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేసే అధికారాన్ని కల్పించటం, ఎక్స్‌ట్రా మ్యూరల్ రీసెర్చ్ ప్రాజెక్టులు, డిఫెన్స్ ఇన్నోవేషన్ యాక్సిలరేటర్- సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్, టెక్నాలజీ డెవలప్‌మెంట్ ఫండ్ ప్రాజెక్టులకు సంబంధించి సహాయక నిధుల ఆర్థిక అధికారాల స్పష్టమైన విభజన వంటివి ఉన్నాయి.

## మున్సిపల్ కో-ఆప్షన్ ఎన్నిక బహిష్కరించిన ఏంఐఎం..



నిజామాబాద్, జూన్ 30:బోధన్ మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికలను ఎంఐఎం కౌన్సిలర్లు బహిష్కరించారు. మంగళవారం బోధన్ మున్సిపల్ కార్యాలయంలో కోఆప్షన్ సభ్యుల ఎన్నికలు జరిగాయి. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి హాజరయ్యారు.

మున్సిపల్‌లో నలుగురు కోఆప్షన్ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉండగా, ఈ ఎన్నికలను బహిష్కరిస్తూ ఎంఐఎం సభ్యులు కార్యాలయ ఆవరణలో బైఠాయించారు. ఎంఐఎం ఫ్లోర్ లీడర్ మీర్ ఇలియాస్ అలీ ఆధ్వర్యంలో తొమ్మిది మంది కౌన్సిలర్లు ఎన్నికలను బహిష్కరించారు.

# 'జాతీయ పెట్టుబడులు-మౌలిక సదుపాయాల నిధి'లో రూ.30వేల కోట్ల అదనపు పెట్టుబడికి మంత్రిమండలి ఆమోదం

న్యూ ఢిల్లీ, జూన్ 30:దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాలు, ఇతర జాతీయ ప్రాధాన్య రంగాల్లో ప్రభుత్వ పెట్టుబడి హామీని మరింత బలోపేతం చేసే దిశగా గతవారం ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన మంత్రిమండలి కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జాతీయ పెట్టుబడులు-మౌలిక సదుపాయాల నిధి (ఎన్ఐఐఎఫ్)కి కొత్త కేటాయింపులు సహా భవిష్యత్ నిధుల సమీకరణ నిమిత్తం అదనంగా రూ.30 వేల కోట్లు సమకూర్చే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. దీనితో 'ఎన్ఐఐఎఫ్'కు కేంద్ర ప్రభుత్వ హామీ నిధుల మొత్తం రూ.60,000 కోట్లకు చేరింది.

భారత స్వతంత్ర పతిపత్త నిధి అయిన 'ఎన్ఐఐఎఫ్'ను 'నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ లిమిటెడ్ (ఎన్ఐఐఎఫ్ఎల్) వృత్తిగతంగా నిర్వహిస్తుంది. ఈ నిధిలో కేంద్ర ప్రభుత్వ వాటా 49 శాతం కాగా, ప్రస్తుతం తన నిధులు-పెట్టుబడి వ్యూహాల ద్వారా దాదాపు రూ.40,000 కోట్ల మూలధన హామీతో దాన్ని నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో మూలధన వినియోగం-రాబడుల రీత్యా 'ఎన్ఐఐఎఫ్' బలమైన పనితీరును ప్రదర్శించింది. తదనుగుణంగా భారీ పోర్ట్‌ఫోలియోల నుంచి నిష్క్రమణ ద్వారా పెట్టుబడిదారులకు రూ.12,000 కోట్లు వాపసుఏ ఇచ్చింది.

"సావరిన్ వెల్త్ ఫండ్స్, పెన్షన్ ఫండ్స్, మల్టీలేటరల్ డెవలప్‌మెంట్", ప్రసిద్ధ దేశీయ ఆర్థిక సంస్థలు సహా అగ్రశ్రేణి సంస్థాగత పెట్టుబడిదారుల నుంచి 'ఎన్ఐఐఎఫ్' మూలధనాన్ని సమీకరించింది. ఇలా నిధులు సమకూర్చిన సంస్థలలో "అబుధాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ, ఆస్ట్రేలియన్ సూపర్, సీపీపీ ఇన్వెస్ట్‌మెంట్స్, ఒంటారియో టీచర్స్ పెన్షన్ ప్లాన్, పీఎస్‌పీ ఇన్వెస్ట్‌మెంట్స్, టెమాసెక్, ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్, న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్, జపాన్ బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్, యు.ఎస్.ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్, హెచ్‌డీఎఫ్‌సీ గ్రూప్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, కోటక్ మహీంద్రా లైఫ్ ఇన్సూరెన్స్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా" వంటి దిగ్గజాలున్నాయి.

ఈ పెట్టుబడిదారు సంస్థలు ఆస్ట్రేలియా, కెనడా, జపాన్, సింగపూర్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, అమెరికా సహా విభిన్న భౌగోళిక ప్రాంతాలకు చెందినవి. వీటి నుంచి నిధులు భారీగా నిధులు సమకూరడాన్ని బట్టి, భారత్ పురోగమన వేగంతోపాటు 'ఎన్ఐఐఎఫ్' నిర్వహణ సామర్థ్యం, వాణిజ్య రంగ పనితీరుపై అంతర్జాతీయ విశ్వాసం ఇనుమడిస్తున్నదని స్పష్టమవుతోంది.

'ఎన్ఐఐఎఫ్' పెట్టుబడి కార్యాచరణ వ్యూహాల్లో భాగమైన మౌలిక సదుపాయాలు, ప్రైవేట్ మార్కెట్లు, గ్రోత్ ఈక్విటీ, ఇండియా-జపాన్ బిజినెస్ కారిడార్‌లోని వాతావరణ పెట్టుబడులు గణనీయ పెట్టుబడి వేగానికి దోహదం చేశాయి.

దేశంలో తొలిసారి రూ.16000 కోట్ల మూలనిధితో ఏర్పాటైన 'ఎన్ఐఐఎఫ్' భారత్‌లో మునుపెన్నడూ లేనంత అతిపెద్ద దేశీయ మౌలిక సదుపాయాల నిధిగా రూపొందింది. రవాణా (రోడ్లు, రేవులు, సంబంధిత సదుపాయాలు, విమానాశ్రయాలు), ఇంధనం (పునరుత్పాదక ఇంధనం, స్మార్ట్ మీటర్లు, విద్యుత్ ప్రసారం), డిజిటల్ మౌలిక సదుపాయాల రంగాలలో పురోగమనానికి ఇది అనువైన వేదికలను సృష్టించింది. స్వదేశీ నిర్వాహకుల ఆధ్వర్యంలోని అనేక అనుబంధ 'ఏఐఎఫ్'లలో 'ఎన్ఐఐఎఫ్' పరిధిలోని ప్రైవేట్ మార్కెట్స్ ఫండ్లు పెట్టుబడి పెట్టాయి. ఆ నిధులను అవి వాతావరణ ఉపశమన ప్రాజెక్టులు, చౌక ఇళ్ల నిర్మాణం, ఆరోగ్య సంరక్షణ సహా వెంచర్ క్యాపిటల్ సాంకేతికతల వంటి రంగాల్లో పెట్టుబడి పెట్టాయి. ఇక ఆర్థిక సేవలు, ఆరోగ్య సంరక్షణ, తయారీ వంటి వృద్ధి ప్రాధాన్య రంగాల్లో పెట్టుబడులపై 'ఎన్ఐఐఎఫ్' పరిధిలోని స్ట్రాటజిక్ ఆపర్చునిటీస్ ఫండ్ దృష్టి సారించింది. ఇందులో ఇండియా-జపాన్ ఫండ్ దాని తొలి ద్వైపాక్షిక నిధిగా ఏర్పడి, వాతావరణ, వర్తుల ఆర్థిక వ్యవస్థ, ఇంధన మార్పిడి, భారత్-జపాన్ వాణిజ్య కారిడార్ పురోగమనానికి తోడ్పడే పెట్టుబడులపై దృష్టి పెడుతోంది.

'ఎన్ఐఐఎఫ్' నిర్వహించే నిధులన్నీ సమష్టిగా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో రవాణా, ఇంధన మార్పిడి, ఆరోగ్య సంరక్షణ, డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఎలక్ట్రిక్ రవాణా, చౌక ఇళ్ల నిర్మాణం, తయారీ, సాంకేతికత వంటి కీలక రంగాల్లో పెట్టుబడులకు మూలధనాన్ని కేటాయించాయి. ఈ పెట్టుబడులన్నీ గతిశక్తి, డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, సీఓపీ బాధ్యతలు, 'ఫేమ్', పీఎం ఇ-డ్రైవ్ వంటి ప్రధాన పథకాల జాతీయ ప్రాథమ్యాలకు అనుగుణంగా ఉండటం గమనార్హం.

మరోవైపు ప్రైవేట్ రంగ పెట్టుబడులను వేగిరపరచే కొత్త 'పీపీపీ' కార్యక్రమాలు, పెట్టుబడి వ్యూహాలకు కేంద్ర ప్రభుత్వ విభాగాలు, రాష్ట్ర సంస్థలకు ఆర్థిక చేయూత ద్వారా 'ఎన్ఐఐఎఫ్' వ్యూహాత్మక సలహాదారు పాత్రను కూడా పోషిస్తోంది. ఇందులో 'మారిటైమ్ డెవలప్‌మెంట్ ఫండ్, రీసెర్చ్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ ఫండ్' వంటివాటిని రూపొందించే దిశగా సలహాలు-విధానపరమైన మద్దతు, ద్రవ్యీకరణ, 'పీపీపీ' నిర్మాణాలపై ప్రభుత్వ అధికారుల ద్వారా సహకారం, జాతీయ ప్రాధాన్యాల మేరకు ఇతర రంగాల వారీ పెట్టుబడి చట్రాలపై సలహాలు, సూచనలు కూడా ఇస్తోంది.

దేశానికి అదనపు ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు భారత ప్రగతి ప్రస్థానానికి తోడ్పడటంలో 'ఎన్ఐఐఎఫ్' ఏళ్ల తరబడి కీలక పాత్ర పోషిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఈ నిధి విశిష్టతను గుర్తిస్తూ అదనపు ఆర్థిక తోడ్పాటుకు ఆమోద ముద్ర వేసింది. దీనివల్ల రవాణా, ఇంధనం, డిజిటల్ మౌలిక సదుపాయాలు, పట్టణ మౌలిక సదుపాయాలు, ఇ-మొబిలిటీ, ఇతర జాతీయ ప్రాముఖ్యంగల ప్రాజెక్టులు సహా పలు రంగాలలో పెట్టుబడులను ప్రోత్సహించడంలో ఈ నిర్ణయం దోహదం చేస్తుందని భావిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం 'ఎన్ఐఐఎఫ్'కు సమకూర్చే రూ.30 వేల కోట్ల అదనపు పెట్టుబడి ఆధారంగా దీనికింద రెండో మౌలిక సదుపాయాల కేంద్రక నిధి ('ఎన్ఐఐఎఫ్'ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్-ఎఎ)ని ఏర్పాటు చేస్తారు. ఇది తొలి ప్రధాన నిధికి వారస నిధిగా సుమారు రూ.30,000 కోట్ల నిధుల సమీకరణపై లక్ష్యనిర్దేశంతో కృషి చేస్తుంది. ఇది రవాణా, ఇంధనం, డిజిటల్ మౌలిక సదుపాయాలు, పట్టణ మౌలిక సదుపాయాలు, ఇ-మొబిలిటీ వంటి వర్ధమాన రంగాల్లో పెట్టుబడులు పెట్టే అవకాశం ఉంది. ఈ కేటాయింపు ద్వారా కొత్త వ్యూహాలకు, తదుపరి ద్వైపాక్షిక, ఇతర వ్యూహాత్మక నిధులకు కూడా 'ఎన్ఐఐఎఫ్' రెండో నిధి మద్దతిస్తుంది.

ప్రస్తుత ప్రభుత్వ కేటాయింపులు, అంతర్లీన ఆస్తులు, పోర్ట్‌ఫోలియో కంపెనీలలో పెట్టుబడుల ద్వారా ఆర్థిక వ్యవస్థపై బహుళ ప్రభావం చూపుతుందని అంచనా. తద్వారా ఇది నాణ్యమైన మౌలిక సదుపాయాలకు, ప్రత్యక్ష-పరోక్ష ఉద్యోగాల కల్పనకు, జాతీయ ప్రాధాన్యంగల కీలక రంగాల వృద్ధికి దోహదం చేస్తుంది. తద్వారా స్వయంసమృద్ధికి, దేశం 2047 నాటికి 'వికసిత భారత్'గా రూపొందడానికి సారథ్యం వహించగలదు.

# రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించాలి

మహబూబ్‌నగర్, జూన్ 30:: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు ఎలాంటి కొరత లేకుండా సకాలంలో అందుబాటులో ఉంచాలని నారాయణపేట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్ ఎరువులు, విత్తనాల డీలర్లను ఆదేశించారు. మంగళవారం ఊట్కూర్ మండల కేంద్రంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన నిల్వలు, విక్రయాల రికార్డులు, లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్లు, బిల్లులు, ఈపీఓఎస్ యంత్రాల పనితీరును పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, విత్తనాలు విక్రయించాలని, రైతులకు తప్పనిసరిగా బిల్లులు అందజేయడంతో పాటు నాణ్యమైన ఉత్పత్తులనే విక్రయించాలని సూచించారు.

ఈపీఓఎస్ యంత్రాల్లో నమోదయ్యే డిజిటల్ స్టాక్‌కు దుకాణాల్లో ఉన్న ఫిజికల్ స్టాక్ పూర్తిగా సరిపోలాలని, ఎలాంటి వ్యత్యాసాలు ఉండకూడదని హెచ్చరించారు. ప్రతి లావాదేవీని ఈపీఓఎస్ ద్వారా నమోదు చేసి రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని, రైతులు అవసరానికి అనుగుణంగా మాత్రమే ఎరువులు వినియోగించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో మండల వ్యవసాయ శాఖ అధికారి గణేష్ రెడ్డి పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడమే ఎస్ఐఆర్ లక్ష్యం



మహబూబ్‌నగర్, జూన్ 30: ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని బీఎల్‌వోలు సమర్థవంతంగా నిర్వహించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని నారాయణపేట రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. శ్రీను సూచించారు. మంగళవారం ఊట్కూర్ మండల కేంద్రంలో బీఎల్‌వోలు, సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని ఆదేశించారు.

ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి పౌరుడి పేరు నమోదు అయ్యేలా ఇంటింటి సర్వేను నిష్పక్షపాతంగా నిర్వహించాలని, దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఓటరు జాబితా ప్రజాస్వామ్యానికి పునాదిగా నిలుస్తుందని పేర్కొంటూ, అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మినహాయించబడకుండా చూడాలని బీఎల్‌వోలకు సూచించారు. ప్రజలకు అవసరమైన అవగాహన కల్పిస్తూ వారి సందేహాలను నివృత్తి చేసి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# భూమాత ఆశీస్సులతో సమృద్ధిగా పంటలు పండాలి..

## -ఏరువాక పౌర్ణమిలో ఫసల్వాది సర్పంచ్ హరి ప్రసాద్ ముదిరాజ్



సంగారెడ్డి, జూన్ 30:: (నేటినిజం ప్రతినిధి): ఏరువాక పౌర్ణమి రైతుల తొలి పండుగ అని, పాడిపశువులు-భూమాతను ఆరాధిస్తూ వ్యవసాయ పనులకు శ్రీకారం చుడితే ప్రకృతి అనుగ్రహంతో సమృద్ధిగా పంటలు పండుతాయని ఫసల్వాడి గ్రామ సర్పంచ్ హరి ప్రసాద్ ముదిరాజ్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో గ్రామ రైతులు ట్రాక్టర్లతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి సంప్రదాయబద్ధంగా ఏరువాక పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ హరి ప్రసాద్ మాట్లాడుతూ వ్యవసాయానికి ఆధారమైన పాడిపశువులను పూజించి, భూమాతకు నమస్కరించడం ద్వారా మంచి వర్షాలు కురిసి పచ్చని పంటలతో పొలాలు కళకళలాడాలని ఆకాంక్షించారు. రైతులు సకాలంలో వ్యవసాయ పనులు ప్రారంభించి సమృద్ధిగా పంటలు పండించి ఆర్థికంగా వృద్ధి చెందాలని ఆకాంక్షించారు. గ్రామంలో రైతులంతా ఐక్యంగా పాల్గొని ఏరువాక పండుగను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించడంతో పండుగకు ప్రత్యేక శోభ నెలకొంది. ఈ సందర్భంగా సర్పంచ్‌ను గ్రామ పెద్దలు, రైతులు, యువకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

# మున్సిపల్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ధర్నా..



వికారాబాద్, జూన్ 30: వికారాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నాయకులు మంగళవారం భారీ ధర్నా నిర్వహించారు. మున్సిపల్ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిగా నిలిచిపోయాయని, అధికారులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కడియాల వేణుగోపాల్ ఆరోపించారు.

అనంతరం ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ కొండలరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కడియాల వేణుగోపాల్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలను పట్టించుకోకుండా అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

అభివృద్ధి పనులపై అధికారులు ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదని, ప్రతిపక్ష నాయకులను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. అధికార పార్టీ నాయకులు తమపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని, ప్రజా ప్రతినిధులుగా తమకు కనీస గౌరవం కూడా ఇవ్వడం లేదని అన్నారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మేకర్ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ అనంతరెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు కమల్ రెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు వేణుగోపాల్ రెడ్డి, సంతోష్ కుమార్, కొట్పల్లి మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, మార్పల్లి మాజీ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, బూరుగుపల్లి శ్రీనివాస్ రెడ్డి, కొత్తపల్లి ఇస్మాయిల్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ




వికారాబాద్, జూన్ 30: యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో దివంగత యువనేత బోనగిరి గణేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఫ్రెండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఫ్రెండ్స్ సొసైటీ సభ్యులు మాట్లాడుతూ, బోనగిరి గణేష్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.

కార్యక్రమంలో గణేష్ తల్లిదండ్రులు నరసయ్య, జ్యోతి, ఫ్రెండ్స్ సొసైటీ అధ్యక్షుడు గంగసాని నవీన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎండి బాబా, సభ్యులు మంగళపల్లి శివకుమార్, మాదాని నవీన్, చెన్న రాజేష్, గడ్డమీది సాయినాథ్, ఎర్ర రాజేష్, కాముని శివకుమార్, కంకల లింగస్వామి, పరుష నరేష్, రావుల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ల మంజూరుపై ఎమ్మెల్యే నారాయణరెడ్డికి సన్మానం..

వికారాబాద్, జూన్ 30: కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని మండలాలకు రూ.100 కోట్ల వ్యయంతో 160 కిలోమీటర్ల రహదారుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు.

డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహాతో కలిసి ఎమ్మెల్యేకు పూలమాలలు, శాలువా కప్పి సత్కరించి స్వీట్లు తినిపించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క సహకారంతో నియోజకవర్గానికి రహదారులు మంజూరయ్యాయని తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, ప్రతి తండాకు రహదారి సౌకర్యం కల్పించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

# మాతా, నవజాత శిశువుల ఆరోగ్య సంరక్షణను మరింత బలోపేతం చేయడం కోసం 'సుమన్ రోడ్‌మ్యాప్ 2030' ను ప్రారంభించిన కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ జగత్ ప్రకాష్ నడ్డా

న్యూఢిల్లీ, జూన్ 30:దేశవ్యాప్తంగా మాతా, నవజాత శిశువుల ఆరోగ్య సంరక్షణలో సమూల మార్పులు తీసుకురావడమే కాకుండా 2030 నాటికి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించే దిశగా భారత పురోగతిని వేగవంతం చేసే ఉద్దేశ్యంతో రూపొందించిన సమగ్రమైన, దూరదృష్టితో కూడిన వ్యూహాత్మక ప్రణాళిక - సుమన్ రోడ్‌మ్యాప్ 2030ను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ జగత్ ప్రకాష్ నడ్డా ఈ రోజు ప్రారంభించారు.

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మండలి (సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ - సీసీహెచ్ఎఫ్‌డబ్ల్యూ) 16వ సదస్సులో శ్రీ నడ్డా ఈ ప్రణాళికను ఆవిష్కరించారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రులు శ్రీమతి అనుప్రియ పటేల్, శ్రీ ప్రతాప్‌రావ్ జాదవ్, వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఆరోగ్య మంత్రులు, ఆరోగ్య మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు, ఇతర ప్రముఖ ప్రతినిధులు హాజరయ్యారు.

గత దశాబ్ద కాలంలో నిరంతర విధానపరమైన జోక్యాలు, బలోపేతం చేసిన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థల ద్వారా మాతా, నవజాత శిశువుల ఆరోగ్యంలో భారత్ గణనీయమైన ప్రగతిని సాధించింది. అయితే, ఈ అద్భుతమైన పురోగతి ఉన్నప్పటికీ, కొన్ని నిర్దిష్ట అంశాలలోముఖ్యంగా అధిక ప్రాధాన్యత కలిగిన రాష్ట్రాలలో మాతా, నవజాత శిశువుల మరణాల రేటు ఇప్పటికీ ఒక సవాలుగానే మిగిలిపోయింది. ఈ నేపథ్యంలో మరింత లక్షిత, విభిన్నమైన విధానం అవసరమని గుర్తించిన కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ 'సుమన్ రోడ్‌మ్యాప్ 2030'ను రూపొందించింది. దేశవ్యాప్తంగా సమానమైన, అత్యంత నాణ్యమైన ప్రసవ కాల, నవజాత శిశు ఆరోగ్య సంరక్షణను అందించడానికి జాతీయ ప్రాధాన్యతలను స్థానిక పరిస్థితులతో ముడిపెడుతూ పక్కా ఆధారాలతో కూడిన వ్యూహంగా దీనిని తీర్చిదిద్దారు.

సంతానోత్పత్తి, మాతృత్వ, నవజాత శిశు, బాల్య యుక్తవయస్సు ఆరోగ్యం + పోషకాహారం (ఆర్ఎమ్ఎన్‌సిహెచ్ఏ+ఎన్) నిబంధనల ఆధారంగా జీవిత చక్రం మొత్తాన్ని దృష్టిలో ఉంచుకున్న సమగ్ర విధానంగా ఈ రోడ్ మ్యాప్ రూపుదిద్దుకుంది. ఇది గర్భధారణ ముందు కాలం మొదలుకొని.. గర్భధారణ, ప్రసవం, ప్రసవానంతర సమయాల వరకు అవసరమైన వైద్య సహాయాలను ఒకదానితో ఒకటి అనుసంధానిస్తుంది. అలాగే దీనిని బాలల ఆరోగ్యం, యుక్తవయస్సు ఆరోగ్యం, కుటుంబ నియంత్రణ, పోషకాహార కార్యక్రమాలతో కూడా ఏకీకృతం చేస్తుంది.

పునరుత్పత్తి, మాతృ ఆరోగ్య శ్రేణిలోని ప్రతి దశలోనూ ఎటువంటి అంతరాయం లేని, రోగి ప్రాధాన్య సంరక్షణను అందించేలా ఈ వ్యూహాత్మక ప్రణాళికను రూపొందించారు.

ఈ రోడ్‌మ్యాప్ ప్రధానంగా అత్యంత ప్రమాదకరమైన గర్భధారణలను ప్రసవ పూర్వ సంరక్షణ, మూడవ త్రైమాసిక సంరక్షణ, ప్రసవ సమయం, ప్రసవానంతర కాలం అనే నాలుగు క్లిష్టమైన దశల ద్వారా గుర్తించి, ట్రాక్ చేసి, పర్యవేక్షించడానికి ఒక క్రమబద్ధమైన విధానాన్ని కలిగి ఉంది. దీనివల్ల సకాలంలో వైద్య సహాయం అందించి, మెరుగైన క్లినికల్ ఫలితాలను సాధించడానికి వీలవుతుంది.

క్షేత్రస్థాయి అనుభవాలు, కార్యక్రమాల అమలు ద్వారా లభించిన ఆధారాల ఆధారంగా రవాణా సౌకర్యాలు, గిరిజన, మారుమూల ప్రాంతా లలో ఆరోగ్య సేవలు, మెరుగైన అత్యవసర ప్రసవ సంరక్షణ, 'సుమన్ పంచాయతీల' ద్వారా సమాజ భాగస్వామ్యం, మాతా, నవజాత శిశువుల ఆరోగ్యంపై వాతావరణ మార్పుల వల్ల పెరుగుతున్న ప్రభావం వంటి సవాళ్లను కూడా ఈ వ్యూహం ద్వారా పరిష్కరిస్తారు.

సమస్య తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాలలో త్వరితగతిన మార్పులు తీసుకురావడం కోసం ఈ రోడ్‌మ్యాప్ 13 అధిక కేంద్రీకృత రాష్ట్రాలలోని (అసోం, బిహార్, ఛత్తీస్‌గఢ్, హర్యానా, జార్ఖండ్, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఒడిశా, పంజాబ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్) 130 జిల్లాలలో నిర్దిష్ట కాలపరిమితితో కూడిన కార్యక్రమాలను ప్రవేశపెడుతోంది. మెరుగైన మాతా, నవజాత శిశు ఆరోగ్య సంరక్షణ సేవలను నిలబెట్టుకుంటూ, దేశంలో అందరికీ వీటిని అందించేందుకు వీలుగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల కోసం ప్రత్యేక వ్యూహాలను కూడా ఈ ప్రణాళిక నిర్దేశిస్తుంది.

అధిక సమస్యాత్మక రాష్ట్రాలకోసం ఈ రోడ్‌మ్యాప్ ఒక సమగ్ర కార్యాచరణ ప్యాకేజీని ప్రతిపాదిస్తోంది. ఇందులో భాగంగా గర్భిణుల కోసం 'సుమన్ ప్యాకేజీ'ని అందిస్తారు; ఇది ముందస్తు నమోదు, పూర్తి ప్రసవ పూర్వ సంరక్షణ, మెరుగైన క్లినికల్ పరీక్షలు, ప్రసవానంతరం తగినన్ని రోజులు ఆసుపత్రిలోనే ఉండేలా ప్రోత్సహిస్తుంది.

ప్రమాద సంకేతాలను ముందుగానే గుర్తించడం, పోషకాహార సంబంధ అవగాహన, కౌన్సిలింగ్, ప్రసవ సన్నద్ధత, ఆసుపత్రి ప్రసవాలను పెంపొందించడం కోసం గర్భధారణ ఎనిమిది, తొమ్మిదవ నెలలలో ఆశా కార్యకర్తలు వారానికి రెండుసార్లు వారి ఇళ్లకు వెళ్లేలా కూడా ఇది నిబంధనలను కల్పిస్తోంది. ఇంకా క్లినికల్ పరంగా అత్యంత కీలకమైన ప్రసవానంతర కాలంలో గర్భిణులను చూసుకునే సంరక్షకులకు ఆర్థిక సహాయం అందించడం, ప్రసవ సమయ అత్యవసర పరిస్థితుల్లో రవాణా సౌకర్యం కోసం ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వడం వంటివి కూడా ఉన్నాయి.

వీటితో పాటు రవాణా సౌకర్యాలు లేని, వైద్య సేవలు సరిగ్గా అందే అవకాశం లేని మారుమూల ప్రాంతాలలో బర్త్ వెయిటింగ్ హోమ్స్, మాతా శిశు ఆరోగ్య విభాగాలు, అబ్స్టెట్రిక్ హై డిపెండెన్సీ యూనిట్లు, ఐసీయూల ఏర్పాటు ద్వారా ఆరోగ్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేయనున్నారు.

# విత్తన జీవితం ... దేశానికి రైతు సేవ అంకితం

## జూలై 1...ప్రపంచ వ్యవసాయ దినోత్సవం



ప్రతి సంవత్సరం జూలై 1న నిర్వహించే ప్రపంచ వ్యవసాయ దినోత్సవం, మానవ జాతి జీవనాధారమైన వ్యవసాయ రంగ ప్రాముఖ్యతను గుర్తుచేసే సందర్భం. ఈ రోజు అన్నదాతల కృషిని గౌరవించడం, వ్యవసాయ రంగానికి అంకితభావంతో పని చేసే ప్రతి ఒక్కరికి అభినందన తెలిపే ఉదాత్త సందేశాన్ని ప్రసారం చేస్తుంది. ఇది కేవలం ఒక దినోత్సవం మాత్రమే కాదు... భవిష్యత్తు ఆహార భద్రతకు, పర్యావరణ పరిరక్షణకు, గ్రామీణాభివృద్ధికి, సమాజ సమతుల్యతకు మూలమైన వ్యవసాయాన్ని మనస్ఫూర్తిగా ఆలోచించే రోజు.

ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం జూలై 1న ప్రపంచ వ్యవసాయ దినోత్సవాన్ని నిర్వహించడం ఒక భావోద్వేగ పూరిత సందేశాన్ని అందిస్తుంది. వ్యవసాయ రంగం కేవలం ఆహారం పండించే వృత్తిగా మాత్రమే కాకుండా మానవ జీవన రేఖగా, పర్యావరణ పరిరక్షకంగా, సమాజాభివృద్ధికి ప్రేరణగా నిలుస్తోంది. ఈ దినోత్సవం సందర్భంగా అన్నదాతల కృషికి అభినందన తెలుపుతూ, భవిష్యత్ సవాళ్లను పరిష్కరించే దిశగా సామూహిక చింతన అవసరమవుతుంది.

వ్యవసాయం కేవలం పంటలు పండించడం అనే అర్థానికి మాత్రమే పరిమి తమయ్యే రంగం కాదు. ఇది ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక, కోట్లాది మందికి ఉపాధి మార్గం, సమాజ సంస్కృతికి ప్రాణనాడి, పర్యావరణ సమతు ల్యతకు నిర్ధారక శక్తి. గ్రామీణ జీవితానికి పునాది వేసే వ్యవసాయం మన సంస్కృతి, ఆచారాలతో సైతం జతపడి ఉంది. పండుగలు, పంటల కట్టుబాట్లు, వర్షాకాలపు వేడుకలు అన్నీ వ్యవసాయ దశల ఆధారంగా రూపుదిద్దుకున్నవే.



వ్యవసాయ రంగం ప్రపంచ జనాభాలో దాదాపు 26 శాతం మంది ఉద్యోగ అవకాశాలపై ప్రభావం చూపుతోంది. ప్రపంచ వ్యాప్తంగా రెండు బిలియన్ మందికి పైగా ప్రజలు నేరుగా వ్యవసాయ సంబంధిత రంగాల్లో పని చేస్తున్నారు. భారతదేశంలోనే సుమారు 54 శాతం మంది ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. 2023?24 గణాంకాల ప్రకారం భారత దేశంలో వ్యవసాయ రంగం జాతీయ స్థూల ఉత్పత్తిలో (ఉఆఖ) సుమారు 18.3 శాతం వాటా కలిగి ఉంది. ఈ రంగం ద్వారా ముడి సరుకులు, ఆహారం, జాతికి జీవనాధారం లభించడమే కాకుండా, పలు పరిశ్రమలకు మౌలిక మద్దతు లభిస్తోంది. ఉదాహరణకు, పత్తి, చెరకు, నూనె గింజలు, ధాన్యాలు వంటి పంటల ద్వారా వస్త్ర, చక్కెర, నూనె పరిశ్రమలు అభివృద్ధి చెందుతున్నాయి.

వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లలో వాతావరణ మార్పులు కీలకంగా ఉన్నాయి. అంతర్జాతీయ స్థాయిలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో పంటల దిగుబడిపై దుష్ప్రభావం పడుతోంది. ఐపీసీసీ నివేదికల ప్రకారం 2050 నాటికి వర్షాధారిత సాగు ప్రాంతాలలో 10?25 శాతం దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది.

భారత దేశంలో తూర్పు రాష్ట్రాల నుంచి పశ్చిమ ప్రాంతాల దాకా వాతావరణ అస్థిరతలు రైతులకు నష్టాలను కలిగిస్తు న్నాయి. నీటి కొరత, భూసార హీనత, వ్యవసాయ రుణ భారం, మార్కెటింగ్ లో అసమతుల్యత, మధ్యవర్తుల వలయంలో రైతు ఆదాయం తగ్గిపోవడం వంటి అంశాలు రైతుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి.

ఇంకా, భారత దేశంలో రైతు ఆదాయం నామమాత్రంగా పెరుగుతోంది. 2017 నుండి 2023 మధ్య కాలంలో దేశ వ్యాప్తంగా రైతుల సగటు నెలవారీ ఆదాయం రూ. 8,000?10,000 మధ్యగానే ఉందని 'ఎన్ఎస్ఎస్ఓ' నివేదికలు సూచిస్తున్నాయి. ఈ ఆదాయంతో కుటుంబ ఖర్చులు, విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులు మిళితం చేస్తే వ్యవసాయాన్ని కొనసాగించటం చాలా కష్టమైనదిగా మారింది. ఫలితంగా యువత వ్యవసాయాన్ని వదిలి ఇతర రంగాల్లో ఉద్యోగాల కోసం వలస బాట పడుతున్నారు.

ప్రపంచ జనాభా వేగంగా పెరుగుతున్న నేప థ్యంలో, భవిష్యత్తు ఆహార అవసరాలను తీర్చాలంటే వ్యవసాయ రంగం సామర్థ్యాన్ని గణనీయంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

వ్యవసాయ రంగానికి ఆధునికతను చేర్చడం అత్యవసరమవుతోంది.

స్మార్ట్ ఫార్మింగ్, డ్రోన్ సాంకేతికత, భూసార పరీక్షా పద్ధతులు, మైక్రో ఇరిగేషన్ పద్ధతులు, డిజిటల్ మార్కెట్ ప్లాట్‌ఫామ్‌లు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఈఖూబ) వంటి ఆధునిక విధానాల ద్వారా వ్యవసాయాన్ని సమర్థవంతంగా తీర్చిదిద్దవచ్చు. దీనివల్ల నూతన తరం యువత వ్యవసాయాన్ని ఆదాయ సాధక రంగంగా భావించే అవకాశముంది. అంతేకాదు, సుస్థిర వ్యవసాయ విధానాలను అవలంబించడం ద్వారా పర్యావరణానికి హాని లేకుండా సాగు కొనసాగించవచ్చు. జీవ వ్యవసాయం, సహజ వ్యవసాయం, మల్చింగ్, ఇంటిగ్రేటెడ్ క్రాప్ మేనేజ్‌మెంట్ వంటి పద్ధతులు భవిష్యత్‌లో వ్యవసాయ భద్రతను నిర్ధారించ గలవు.




ప్రపంచ వ్యవసాయ దినోత్సవం వ్యవసాయ రంగానికి నూతన దిశలను సూచించే, రైతులకు మానసిక, సాంకేతిక, ఆర్థిక మద్దతును చాటే ఒక చైతన్య దినంగా నిలవాలి.

ఈ రోజు రైతు సమస్యలపై చర్చించడమే కాకుండా, సమగ్ర వ్యవసాయ విధానాలు, గవర్నెన్స్‌లో వ్యవసాయానికి ప్రాధాన్యత, విద్యా రంగంలో వ్యవసాయాన్ని ప్రధానాంశంగా చేర్చడం వంటి అంశాలపై దృష్టి సారించాలి.

రైతు చెమటే మన దేశ అభివృద్ధికి మూలాధారం. ఆ చెమట విలువను గుర్తించడం, వ్యవసాయ రంగాన్ని ఆధునికతతో మేళవించడం మనందరి బాధ్యత.

వ్యవసాయం మన వంటలపై మాత్రమే కాదు ? మన దేశపు భద్రత, మనుగడ, సమాజ సంస్కృతి, పర్యావరణపై ప్రభావం చూపే రంగం. అలాంటి రంగానికి అంకితమైన ఈ దినోత్సవాన్ని కేవలం జ్ఞాపకార్థ దినంగా కాక, రైతు జీవితాన్ని వెలిగించే ఉద్యమ దినంగా మలచుకుందాం.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# భూపాలపల్లి జిల్లా ఆసుపత్రిలో ఎమ్మారై సేవల ప్రారంభం

## -వర్చువల్ విధానంలో ప్రారంభించిన సీఎం



నల్గొండ, జూన్ 30:భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రూ.12.50 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన అత్యాధునిక ఎమ్మారై యంత్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ జిల్లా ప్రజలకు ఆధునిక వైద్య సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఎమ్మారై సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు.

దీంతో క్లిష్ట వైద్య పరీక్షల కోసం ఇతర జిల్లాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గి, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోనే నాణ్యమైన ఎమ్మారై పరీక్షలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం అవసరమైన సౌకర్యాలను కల్పిస్తోందని, ఆసుపత్రి అభివృద్ధికి మరిన్ని చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు.

కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రాజేంద్ర ప్రసాద్, డిప్యూటీ సూపరింటెండెంట్ డా. వెంకటరత్నం, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా. మధుసూదన్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షుడు బట్ట కరుణాకర్, మున్సిపల్ కౌన్సిలర్లు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లులతో మంగపేటలో ఇసుక లోడింగ్ బంద్

వరంగల్, జూన్ 30:రాష్ట్ర ప్రభుత్వం ఇసుక క్వారీలను నిర్వహిస్తున్న గిరిజన సొసైటీలకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు విడుదల చేయకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన బంద్‌లో భాగంగా మంగళవారం ములుగు జిల్లా మంగపేట మండలంలోని మూడు ఇసుక రీచ్‌ల వద్ద లోడింగ్ నిలిపివేశారు. పెండింగ్ బకాయిలు అందకపోవడంతో పాటు డీజిల్ ధరలు పెరగడం వల్ల డ్రైవర్లు, సూపర్‌వైజర్లకు జీతాలు చెల్లించడమే కాకుండా క్వారీల నిర్వహణ కూడా భారంగా మారిందని నిర్వాహకులు తెలిపారు.ప్రభుత్వం వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించి తమ సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో బంద్‌ను కొనసాగిస్తూ ఇసుక లోడింగ్‌ను పూర్తిగా నిలిపివేస్తామని ఇసుక రీచ్ నిర్వాహకులు హెచ్చరించారు. ఈ విషయాన్ని టీజీఎండీసీ అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు సమాచారం.

# సారపాకలో భారీగా గంజాయి పట్టివేత

ఖమ్మం, జూన్ 30: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలో మంగళవారం భారీగా గంజాయి పట్టుబడింది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ నుండి కంటైనర్ లారీలో భద్రాచలం మీదుగా గంజాయి తరలిస్తుండగా సారపాక గోదారమ్మ క్యాంప్ సమీపంలో అందిన సమాచారం మేరకు పోలీసులు కంటైనర్ లారీని తనిఖీ చేశారు. అందులో కోట్లాది రూపాయల గంజాయి ఉన్నట్లు గుర్తించి కంటైనర్‌ను స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. గంజాయి తరలిస్తున్న కంటైనర్ లారీ ఉత్తరప్రదేశ్ కు వెళ్తున్నట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును చేపట్టారు.

# ప్రజల్లో ఉంటూ పోరాడితే పదవులు వస్తాయి..

## -బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్



హైదరాబాద్, జూన్ 30: ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడితే పదవులు అవే వస్తాయని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ అన్నారు.

మంగళవారం హైదరాబాద్‌లో కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావులను ఆయన అభినందించారు. తెలంగాణలో బీజేపీ తరపున కరీంనగర్ కార్పొరేషన్ ఒక్కటే గెలిచిన సందర్భాన్ని ఈ సమావేశంలో ప్రస్తావించారు.

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, సునీల్ బన్సల్, నితిన్ నబిన్‌కు మేయర్, డిప్యూటీ మేయర్లను పరిచయం చేయగా ఆయన వారికి శాలువా కప్పి సత్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం కష్టపడి పనిచేసే నాయకులకు తప్పకుండా పదవులు దక్కుతాయని అన్నారు. కరీంనగర్ నగర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. నగర అభివృద్ధి కోసం మరింత శ్రమించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యురాలు రేఖా శర్మ తదితరులు పాల్గొన్నారు.

# 19 వేల పోస్టులతో పోలీస్ నోటిఫికేషన్ జారీచేయాలి

## -మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి విజ్ఞప్తి



సంగారెడ్డి, జూన్ 30:: (నేటినిజం ప్రతినిధి):ప్రభుత్వం కొత్తగా జారీ చేసే పోలీస్ నోటిఫికేషన్‌లో మెదక్ జిల్లాకు ప్రాధాన్యం కల్పించాలని, 19 వేల పోస్టులతో ఎస్సై, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ఆదేశాలు ఇవ్వాలని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మెదక్ పట్టణంలో ఉన్న జిల్లా గ్రంథాలయంలో చదువుకుంటున్న నిరుద్యోగుల సమస్యలను ఆమె తెలుసుకున్నారు.

అనంతరం వారితో కలిసి మెదక్ కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రతిమా సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా 5 వేల పోస్టులకు నోటిఫికేషన్ వస్తుందని సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ అయ్యాయన్నారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న దాంట్లో మెదక్ జిల్లాకు పోస్టులు చూపించలేదన్నారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పోస్టుపై పోలీస్ శాఖ అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మెదక్ జిల్లాకు సంబంధించిన పోస్టు లు ఎందుకు చూపడం లేదని ప్రశ్నించారు. పోలీస్ నోటిఫికేషన్‌లో మెదక్ జిల్లాకు పోస్టులు వచ్చే విధంగా కృషి చేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్‌కు ఆమె కోరారు.

కేసీఆర్ సర్కార్ హయాంలో 38 వేల పోలీస్ ఉద్యోగాలు భర్తీ చేయడం జరిగిందని పద్మాదేవేందర్‌రెడ్డి తెలిపారు. అన్ని వర్గాలకు మేలు చేసేందుకు కేసీఆర్ ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ పోలీస్‌శాఖలో 19 వేల పోస్టులు ఖాళీగా ఉంటే కేవలం 5 వేల పోస్టులు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేస్తుందని సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ కావడంపై నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. మెదక్ జిల్లా కేంద్రం లో ఉన్న గ్రంథాలయంలో నిరుద్యోగులు చదువుకునేందుకు సమయం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఉందని, రాత్రి 9 గంటల వరకు సమయం పెంచాలని కలెక్టర్ ప్రతిమా సింగ్‌ను కోరారు.

గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు, సౌకర్యాలు కల్పించాలన్నారు. రాత్రి 8 గంటలకు గ్రంథాలయం మూసివేయడంతో నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కలెక్టర్ స్పందించి నిరుద్యోగులు చదువుకునేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

మాజీ జడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యరెడ్డి, బీఆర్ఎస్ మెదక్ పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయు లు, బీఆర్ఎస్ నాయకుడు, ఏఎం సీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, మెదక్ మండల అధ్యక్షుడు అంజాగౌడ్, హవేలీ ఘనపూర్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, చిన్నశంకరంపేట అధ్యక్షుడు రాజు, మున్సిపాల్ కౌన్సిలర్ జుబే ర్, బట్టి ఉదయ్‌కుమార్, పాల్గొన్నారు.

# ముత్యాలమ్మగూడెం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

నల్గొండ, జూన్ 30: నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం ముత్యాలమ్మగూడెం సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజాము ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. భీమవరం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఇంటర్‌సిటీ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రయాణిస్తుండగా అకస్మాత్తుగా టైర్ పేలింది. దీంతో బస్సు అదుపు తప్పి డివైడర్‌ను దాటి ఎదురుగా హైదరాబాద్ నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్న సిమెంట్ లారీని బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో బస్సు డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోగా, లారీ డ్రైవర్‌కు కూడా గాయాలయ్యాయి. అయితే బస్సులో ఉన్న ప్రయాణికులు అందరూ సురక్షితంగా బయట పడడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే 108 అత్యవసర సేవలకు సమాచారం అందించారు. కట్టంగూర్ 108 అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ శ్రీనివాస్, పైలట్ సమీర్ ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంతో జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించి, ప్రమాదానికి సంబంధించిన కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ప్రజావాణికి పోటెత్తిన ఫిర్యాదులు

## నిజామాబాద్‌లో 122.. కామారెడ్డిలో 101 వినతులు



కామారెడ్డి, జూన్ 30: ఉమ్మడి జిల్లాలోని కలెక్టరేట్లలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు పోటెత్తాయి. నిజామాబాద్‌లో 122, కామారెడ్డిలో 101 వినతలు వచ్చాయి. నిజామాబాద్‌లో జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన వినతులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ వెంటవెంటనే పరిష్కరించాలన్నారు. అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. వేసవి సెలవుల అనంతరం విద్యాసంస్థలు తిరిగి ప్రారంభమైన నేపథ్యంలో మండల ప్రత్యేకాధికారులు, మండల విద్యాధికారులు క్షేత్రస్థాయిలో విధిగా సందర్శిస్తూ సౌకర్యాలను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. అదనపు కలెక్టర్లు కిరణ్‌కుమార్, భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేశ్, డీఆర్వో గీత, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, జడ్పీ సీఈవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్, డీఆర్డీవో సాయన్న పాల్గొన్నారు.

ప్రజావాణిలో వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అదనపు కలెక్టర్లు విక్టర్, ఎన్వీ గిరి, జడ్పీ సీఈవో చందర్, అధికారులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.